మనం!

జనం కోసం అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 3 • సంచిక: 5 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | బుధవారం • 2-1-2019 | www.manamnews.com | /manamnews

టైటానియంకోసం బోయింగ్ లంచం

మన అధికారులకు 18.5 మిలియన్ డాలర్లు

యూపీఏ హయాంలో 2000లో ముడుపులు.. ఉచ్చులో ఎనిమిది మంది అధికారులు

న్యూయార్క్ టైమ్స్ సంచలన కథనం.. సీబీఐ దృష్టికి తీసుకెళ్తా..: సుబ్రమణ్యస్వామి

న్యూఢిల్లీ, జనవరి 1:

ప్రముఖ అమెరికన్ దినపత్రిక న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన ఓ కథనం ఇప్పుడు మనదేశంలో సంచలనం సృష్టిస్తోంది. విమాన సంస్థ బోయింగ్ ..మిగతా 2లో



రైల్వేకు కొత్త రూపు

ప్రధాని మోదీ దార్శనికతతోనే అభివృద్ధి

నాలుగన్నరేండ్లలో ప్రేరణాత్మక కృషి

ప్రపంచ స్థాయి దిశగా అడుగులు

వినియోగదారుల సంతృప్తే లక్ష్యం

రైల్వే బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వినోద్ కుమార్ యాదవ్

3



కొలువుదీరిన హైకోర్టు

తెలంగాణ తొలి సీజేగా జస్టిస్ రాధాకృష్ణన్

ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు

సీఎం కేసీఆర్‌తో సహా, పలువురు హాజరు

హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిధి):

తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రాధాకృష్ణన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ జస్టిస్ రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం హైకోర్టు ఆవరణలో న్యాయమూర్తుల బాధ్యత స్వీకార కార్యక్రమం జరిగింది. చీఫ్ జస్టిస్ చేతుల మీదుగా బాధ్య తలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు పలు వురు ఉన్నతాధికారులు హజరయ్యారు. ఎమ్మెల్యేలు, మిగతా 2లో..



జూన్ నాటికి నీరందించాలె

మూడు షిఫ్టుల్లో పనులు జరగాలె

ఏప్రిల్‌లో కాపర్ డ్యామ్ ట్రయల్ రన్

వర్షాకాలం నాటికి

మిడ్‌మానేరుకు నీరు ఎత్తిపోయాలె

కాళేశ్వరం ప్రాజెకుపై కేసీఆర్ ఆదేశం

రాత్రి కరీంనగర్‌లో బస చేసిన సీఎం

హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిధి) / కరీంనగర్ బ్యూరో, మనం న్యూస్:

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజిలు, పంపుహౌజుల నిర్మాణాలన్నీ మార్చి చివరి నాటికే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఇరిగేషన్ అధికారులను, వర్క్ ఏజెన్సీలను ఆదేశించారు. గోదావరిలో కాపర్ డ్యామ్ ఏర్పాటు చేసుకుని ఏప్రిల్ నెలలో ట్రయల్ రన్ నిర్వహించాలని చెప్పారు. ఈ వర్షాకాంలోనే గోదావరి నీటిని మిగతా 2లో..



సమయం ఎప్పుడో చెప్పండి

రఫేల్ డీల్‌పై చర్చకు మేం సిద్ధం

అరుణ్ జైట్లీ సవాలుకు కాంగ్రెస్ సై

పార్లమెంటులో చర్చకు రెడీ: ఖర్గే

5

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిరమాసం; తిథి: బహుళపక్షం, ద్వాదశి రా.3.36 వరకు; తదుపరి: త్రయోదశి; నక్షత్రం: విశాఖ ప.12.02 వరకు; తదుపరి: అనూరాధ; వర్జ్యం: సా.4.03 నుంచి 5.43 వరకు; దుర్ముహూర్తం: ప.11.42 నుంచి 12.24 వరకు; రాహుకాలం: ప.12.00 నుంచి 1.30 వరకు; యమగండం ఉ.7.30 నుంచి 9.00 వరకు; అమృతఘడియలు: రా.1.55 నుంచి 2.34 వరకు;

వాతావరణం



బుధవారం తెలంగాణలో వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 25 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 16 డిగ్రీలు

గాలి వేగం: గంటకు 8 కి.మీ.

కూటమి ఓటమికి ఉత్తమ్, రమణలే కారకులు

మితిమీరిన విశ్వాసమే ఓడగొట్టింది



ఫ్రంట్ పొలిట శాపంగా వారిద్దరి ఒంటెద్దు పోకడలు

కూటమిలోనే కొనసాగుతం.. ఎవరితోనూ కలవం

ఫెడరల్ ఫ్రంట్ ఎందుకు పెడుతున్నరో కేసీఆర్ చెప్పాలె

పంచాయతి ఎన్నికల్లో ఎక్కువ సీట్ల సాధనకు యత్నాలు

నాకు రాజ్యసభ సీటు ఇస్తారని వస్తున్న వార్తలు అవాస్తవం

మీడియాతో చిట్‌చాట్‌లో కూటమి కన్వీనర్ కోదండరాం

3



పంచాయతీ చాటింపు

మూడు విడతల్లో ఎన్నికలు

బ్యాలెట్ పేపర్‌తోనే ఎన్నికలు

పోలింగ్ ముగియగానే కౌంటింగ్

12751 గ్రామ పంచాయతీల్లో

1,49,52,000 మంది ఓటర్లు

ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి

హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిది):

తెలంగాణలో మొత్తం మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన షెడ్యూలు ప్రకటించారు. జనవరి 7న తొలి విడత, 11న రెండో విడత, 16న మూడో విడత ఎన్నికలు ప్రారంభమవుతాయన్నారు. జనవరి 21, 25, 30వ తేదీలలో పోలింగ్ ఉంటుందని, పోలింగ్ ముగియగానే కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవు తుందన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ సమయం ఖరారు చేశామన్నారు. ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 19 వరకు జాబితాలో ఉన్నవారందరికీ మిగతా 2లో..

ఇదీలోకం!



మొదట చంద్రబాబు వల్ల అన్నారు. తరువాత ఈసీ వల్లే అన్నారు. ఇప్పుడు వీవీప్యాట్ స్లిప్‌ల వల్ల అంటున్నారు. కొన్నాళ్లకి నా వల్లే అంటారేమో!

కేసీఆర్ ఫ్రంట్ విషయమే తెలియదు

తెలంగాణపై ద్వేషంతోనే బాబు రాజకీయం

- మహాకూటమి అనే మాటకే అర్థం లేదు
- అది దేశం వర్సెస్ కూటమే అవుతుంది
- సర్జికల్ స్ట్రైక్స్ ఓ ఉద్విగ్న ఘట్టం...
- న్యూస్ ఛానల్ ఇంటర్వ్యూలో ప్రధాని



న్యూఢిల్లీ, జనవరి 1 (మనం ప్రతినిధి):

కేసీఆర్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నారన్న విషయమే తెలియదని ప్రధాని మోదీ అన్నారు. మోదీ కోసమే కేసీఆర్ ఫ్రంట్ సన్నాహాలు చేస్తున్నారన్న చంద్రబాబు విమర్శలకు మోదీ కౌంటర్ ఇచ్చారు. ఒక జాతీయ న్యూస్ ఛానల్ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ మాట్లాడుతూ 'తెలంగాణపై చంద్రబాబు ద్వేషంతో రాజకీయం చేయాలనుకున్నారు. అందుకే తెలంగాణ ఎన్నిక ల్లో కంగుతిన్నారు. ఆ ఆక్రోశంతో ఏదేదో మాట్లాడుతున్నారు. అసలు మహాకూటమి అనే మాటకే అర్థం లేదు. ఒక వ్యక్తి లక్ష్యంగా పార్టీల న్నీ ఏకమవుతాయా? మిగతా 2లో..



మద్దతు డౌటే!

కాంగ్రెస్ ప్రభుత్వాలకు మాయావతి షాక్

తాను పునరాలోచించాల్సి వస్తుందని వెల్లడి

రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో ప్రకంపనలు

నిర్దోషులపై కేసుల ఎత్తివేతకు డిమాండ్

కాంగ్రెస్.. బీజేపీలా వ్యవహరించకూడదు

కాగితాల మీద మాటల్లో ఇద్దరూ ఒకటే!

ప్రకటనలు చాలవు.. హెచ్చరికలు తప్పట్లేదు

ప్రమాదసూచిక ఇచ్చిన బీఎస్పీ అధినేత్రి

2

కాంగ్రెస్‌కు మరో ఝలక్

టీఆర్ఎస్‌లోకి అజారుద్దీన్



సికింద్రాబాద్ నుంచి పార్లమెంటుకు పోటీ

సంక్రాంతి తర్వాత చేరిక

హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిది): ఇండియన్ క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ మిగతా 2లో..



కొలువుదీరిన హైకోర్టు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీలు, సీపీ లు, న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన న్యాయమూర్తుల్లో జస్టిస్ పులిగోరు వెంకట సంజయ్ కుమార్, జస్టిస్ మామిడాల సత్యరత్న శ్రీ రామచంద్ర రావు, జస్టిస్ అడవల్లి రాజశేఖర్ రెడ్డి, జస్టిస్ పానుగోటి నవీన్ రావ్, జస్టిస్ చల్లా కోదండరాం చౌదరి, జస్టిస్ బులుసు శివ శంకర్ రావు, జస్టిస్ డా. షమీమ్ అఖ్తర్, జస్టిస్ పొట్లపల్లి కేశవ రావు, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ తొలుపునూరి అమర్‌నాథ్ గౌడ్, జస్టిస్ వి రామ సుబ్రహ్మణ్యన్, ఆర్ ఎస్ చౌహన్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు మరో ఝలక్

(మొదటిపేజీ తరువాయి)



ప్రెసిడెంట్ మహమ్మద్ అజారుద్దీన్ టీఆర్ఎస్‌లో చేరనున్నారా?, అంటే అవుననే అంటున్నాయి రాజకీయ వర్గాలు. టీఆర్ఎస్ మిత్రపక్ష పార్టీకి చెందిన ఓ ఎంపీ మధ్యవర్తిత్వంతో అజారుద్దీన్ టీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన టీఆర్ఎస్‌లో చేరితే సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఆ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం ఉందని గులాబీ పార్టీ వర్గాలు చెపుతున్నాయి. ఇటీవల ఆ ఎంపీ కుమార్తె వివాహానికి అజారుద్దీన్ హాజరైనప్పుడు ఈ విషయంలో మాటా మంతీ జరిగినట్లు సమాచారం. ఈవిషయాన్ని సదరు ఎంపీ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు తెలిసింది. అజారుద్దీన్ను పార్టీలో చేర్చుకుని ఆయనకు సికింద్రాబాద్ ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని కూడా ఆ ఎంపీ కేసీఆర్ కు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. సంక్రాంతి తరువాత అజారుద్దీన్ టీఆర్ఎస్ పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెపుతున్నారు. తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే నియమితులైన అజారుద్దీన్ 2009వ సంత్సరంలో కాంగ్రెస్ పార్టీలో చేరి ఉత్తరప్రదేశ్ లోని మొరాదాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2014 నుంచి తెలంగాణ రాజకీయ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అయితే మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓడిపోవడంతో తన రాజకీయ భవిష్యత్తు కోసం అజారుద్దీన్ టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించిన అజారుద్దీన్‌ను టీఆర్ఎస్ లో చేర్చుకోవడానికి గతంలో కూడా ప్రయత్నాలు జరిగాయి. రాహుల్ గాంధీతో సన్నిహిత సంబంధాలున్న అజారుద్దీన్ గతంలో మనసు మార్చుకోవడానికి అంగీకరించలేదు. తెలంగాణలో కాంగ్రెస్ పక్షాన పార్లమెంటుకు పోటీ చేసే అవకాశం లేకపోవడంతో ఆయన టీఆర్ఎస్‌లో చేరి సికింద్రాబాద్ నుండి పోటీ చేయాలనే ఆలోచన మేరకు మనసు మార్చుకున్నారని అంటున్నారు. హైరారాబాద్ పార్లమెంటు నియోజక వర్గం నుండి మరో సారి పోటీ చేయడానికి సిద్ధపడిన మజ్లీస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ అండదండలతోనే ఆయన టీఆర్ ఎస్‌లో చేరడంతో పాటుగా పార్లమెంటుకు పోటీ చేయడానికి సిద్ధమయ్యారని అంటున్నారు.

కాంగ్రెస్‌కు కొత్త నోళ్లు

- 10 మంది అధికార ప్రతినిధుల నియామకం
- తెలంగాణకు చెందిన దాసోజు శ్రవణ్‌కు స్థానం
- జాతీయ అధికార ప్రతినిధిగా ప్రాధాన్యం
- వారిలో కొందరు మీడియా ప్యానలిస్టులు
- నియామకాలు చేసిన అధ్యక్షుడు రాహుల్

న్యూఢిల్లీ, జనవరి 1: ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధులుగా పది మంది నియామకానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆమోదం తెలిపారు. వారిలో తెలంగాణ కాంగ్రెస్ నాయకుడు దాసోజు శ్రవణ్ కూడా ఉన్నారు. వారిలో కొందరు ఇంతకుముందు పార్టీ తరపున మీడియా ప్యానలిస్టులుగా ఉండేవారు. కొత్త అధికార ప్రతినిధులలో రాజ్యసభ ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్, పవన్ ఖేరా, జైవీర్ షేర్‌గిల్, రాగిణీ నాయక్, గౌరవ్ వల్లభ్, రాజీవ్ త్యాగి ఉన్నారు. ఇంకా ఉత్తరప్రదేశ్ నాయకుడు అఖిలేష్ ప్రతాప్ సింగ్, సునీల్ అహజర్, హీనా కవారే (ఎమ్మెల్యే) కూడా ఉన్నారు. ఇప్పటికే పార్టీలో 9 మంది అగ్ర నేతలు సీనియర్ అధికార ప్రతినిధులుగా ఉండగా మరో 26 మంది అధికార ప్రతినిధులూ ఉన్నారు. ఇక కొత్త మీడియా ప్యానలిస్టులుగా షమా మహ్మద్, ఐశ్వర్యా మహదేవ్, అదిల్ బొపారాయ్, అమన్ పవార్, సంజయ్ చోకర్, అనిల్ ధంతోరి, స్వరితా లైప్లాంగ్ ఉన్నారు. వీరితో పాటు సంజీవ్ సింగ్‌ను ప్రధాన జాతీయ మీడియా సమన్వయకర్తగాను, మనోజ్ త్యాగి, మహ్మద్ ఖాన్‌లను జాతీయ మీడియా సమన్వయకర్తలుగాను నియమించారు.

టైటానియంకోసం బోయింగ్ లంచం



(మొదటి పేజీ తరువాయి)

మన భారతీయ అధికారులకు 18.5 మిలియన్ల డాలర్ల లంచం ఇచ్చినట్టు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. కీలకమైన ఎనిమిది మంది భారతీయ అధికారులకు లంచం ఇచ్చి బోయింగ్ కంపెనీ కోసం టైటానియం సేకరించే ప్రయత్నం చేశారన్నది న్యూయార్క్ టైమ్స్ ఆర్టికల్ సారాంశం. తేలికైన లోహం టైటానియంతో విమానాలు తయారు చే స్తారు. బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787 అనే కొత్త విమానం తయారు చేసేందుకు అవసరమైన టైటానియం కోసం అన్వేషణలో ఉండగా ఇదంతా చోటుచేసుకుంది. ఈమేరకు ఉక్రెయిన్ వ్యాపార సామ్రాజ్యాధినేత డింట్రీ వీ ఫిర్టాష్, ఆయనకు చెందిన బొత్లి ట్రేడ్ ఏజీ గ్రూప్ సంయుక్తంగా టైటానియం నిక్షేపాల తవ్వకాలకు, బోయింగ్ జెట్ మేకర్‌కు విక్రయించేందుకు (అప్పటి సంయుక్త) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పంద పత్రాలు కూడా పూర్తయ్యాయి. ఈ కథనాన్ని ట్వీట్ చేసిన సుబ్రమణ్యస్వామి, మొత్తం వ్యవహారాన్ని సీబీఐ దృష్టికి తీసుకెళ్తున్నట్టు వెల్లడించారు. అయితే ఈ డీల్ అమలులోకి రానప్పటికీ ప్రస్తుతం బిజినెస్ టైకూన్ ఫిర్టాష్‌ను అమెరికా విచారణ నిమిత్తం రప్పించుకునే ప్రయత్నంలో ఉండగా ఈ పాత వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కాగా తాను ఎవరికీ లంచం ఇవ్వజూపలేదంటూ ఫిర్టాష్ చెప్పుకొచ్చారు.


జూన్ నాటికి సాగు నీరందించాలె

(మొదటిపేజీ తరువాయి)



మిడ్ మానేరు వరకు ఎత్తిపోసేలా ప్రణాళిక వేసుకుని, అమలు చేయాలని సూచించారు. రైతులు సాగునీటి కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజి, కన్నెపల్లి పంపుహౌజులను సందర్శించారు. పనుల పురోగతిని పరిశీలించారు. అక్కడికక్కడే పలు సూచనలు చేశారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌ల నిర్మాణంతో పాటు పంపుహౌస్‌ల నిర్మాణం పనులు, మోటార్ల ఏర్పాటు పనులన్నీ సమాంతరంగా పూర్తి కావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మార్చి 31 వరకు ప్రధానమైన పనులన్నీ పూర్తిచేసి ఏప్రిల్, మే నేలల్లో ఇతర సమస్యలన్నింటిని పరిష్కరించుకుని ఎట్టి పరిస్థితుల్లోను జూన్ లో సాగునీరు అందించడానికి సిద్ధం కావాలని సీఎం సూచించారు. గోదావరిలో తెలంగాణ వాటా నీళ్లను వీలైనంత త్వరగా ఉపయోగించుకోవాలంటే, పంపు హౌస్ ల నిర్మాణం, మోటార్ల బిగింపు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. గోదావరికి రెండు వైపుల ఉండే ఫ్లడ్ బ్యాంక్స్ పనులను పరిశీలించిన కేసీఆర్, మట్టిపని రివిట్ మెంట్ పనులను పూర్తి జలాశయ మట్టం దాకా పూర్తి చేయాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్ల ఏర్పాటు పనులను, గేట్లను ఆపరేట్ చేసే విధానాన్ని పరిశీలించారు. మేడిగడ్డ బ్యారేజికి సంబంధించిన రాఫ్ట్ ఫౌండేషన్ పనులను జనవరి నెలాఖరు లోపల పూర్తి చేయాలని సీఎం సూచించారు. మేడిగడ్డ బ్యారేజ్ కాంక్రిటు వర్క్ రోజుకు 10 వేల క్యూబిక్ మీటర్లకు తగ్గకుండా చేయాలని వర్కింగ్ ఏజెన్సీని ఆదేశించారు. కన్నెపల్లి పంపు హౌస్ ఫోర్ బే, హెడ్ రేగ్యులేటర్ పనులను పరిశీలించిన సందర్భంగా, హెడ్ రేగ్యులేటర్ పనుల్లో ఉన్న సాంకేతిక లోపలను సవరించాలని సూచించారు. కన్నెపల్లి పంపు హౌస్ పనులను, 11 పంపులు బిగించే ప్రక్రియను మార్చి చివరి కల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. సముద్ర మార్గంలో చెన్నై దాకా చేరుకుని, పోర్టులో వున్న మోటార్లను కూడా వెంటనే తెప్పించాలని అధికారులకు సూచించారు. నిధుల పరంగా ఎలాంటి ఇబ్బంది లేదని ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తిచేసే విషయంలో ఏమాత్రం రాజీపడవద్దని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రజలు గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో మళ్ళీ టీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టారని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రభుత్వం కూడా చిత్తశుద్ధి చాటుకుంటుందని చెప్పారు.



కాళేశ్వరం ప్రాజెక్టు పనులను సీఎంవో సెక్రటరీ ప్రతి పది రోజులకు ఒకసారి పర్యవేక్షిస్తారని సీఎం తెలిపారు. సబ్ స్టేషన్ పనులను పూర్తిచేయాలని ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్ రావును సీఎం ఫోన్ లో ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట చీఫ్ సెక్రటరీ ఎస్.కె. జోషీ, డీజీపీ మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, దివాకర్ రావు, శ్రీధర్ బాబు, టీఎస్ ఎండీసీ ఛైర్మన్ శేరి సుభాష్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వివేక్, సీఎం సెక్రటరీ స్మితా సబర్వాల్, నీటి పారుదల అభివ ద్ధి సంస్థ ఛైర్మన్ వి. ప్రకాష్, ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ మురళీధర్ రావు, సీఈ వెంకటేశ్వర్లు, సీఎం ఓఎస్ డి శ్రీధర్ రావు దేశ్ పాండే, లిఫ్ట్ సలహాదారు పెంటారెడ్డి, ఎల్ అండ్ టి సీఎండి సుబ్రామ్మణ్యన్, మెగా ఎండీ క ష్ణారెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

రాత్రి కరీంనగర్‌లో బస

సిఎం కెసిఆర్ రాత్రి కరీంనగర్ చేరుకున్నారు. కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి గల ఆయన స్వగృహం(తెలంగాణ భవన్)లో బస చేశారు. సిఎం పర్యటన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ వ్యాప్తంగా పోలీసు ఉన్నతాధికారులు కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టారు. సిఎం ఇంటి వద్ద కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు. సిఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టుల బాటలో భాగంగా కరీంనగర్‌కు చేరుకున్న కెసిఆర్‌కు ఎంపిలు, ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు.

అమ్మ బతికేదేమో!

విదేశాలలో చికిత్స చేయించాల్సింది

ఎయిర్ అంబులెన్సు ఇస్తామన్న కేంద్రం

అనుమతించని ఆరోగ్యశాఖ కార్యదర్శి

యాంజియోగ్రామ్‌కూ ఒప్పుకోలేదు!

ఉన్నతాధికారులు అబద్ధాలు చెప్పారు

ప్రత్యేకంగా పోలీసు దర్యాప్తు చేయాలి

తమిళనాడు న్యాయమంత్రి షణ్ముగం





చెన్నై, జనవరి 1: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఆరోగ్యం గురించి.. ఆమె అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఇద్దరు ఉన్నతాధికారులు తమకు అబద్ధాలు చెప్పారని తమిళనాడు న్యాయశాఖ మంత్రి సీవీ షణ్ముగం ఆరోపించారు. 75 రోజుల పాటు ఆసుపత్రిలో ఉన్నప్పుడు ఆమెకు సరైన చికిత్స చేసి ఉంటే అమ్మ ఈ పాటికి బతికే ఉండేవారని విల్లుపురంలో విలేకరులతో మాట్లాడుతూ షణ్ముగం వ్యాఖ్యానించారు. అత్యాధునిక చికిత్స కోసం ఆమెను విదేశాలకు తీసుకెళ్లేందుకు నాటి ఆరోగ్య శాఖ కార్యదర్శి రాధాకృష్ణన్ అనుమతించలేదని, అలాగే మాజీ ప్రధాన కార్యదర్శి పి.రామమోహనరావు విచారణ కమిషన్ వద్ద భిన్న ప్రకటనలు చేశారని ఆయన అన్నారు. ప్రస్తుతం రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎ. ఆర్ముగస్వామి నేతృత్వంలో జరుగుతున్న దర్యాప్తుతో పాటు.. అదనంగా జయలలిత మృతికి ముందు జరిగిన సంఘటనలపై ప్రత్యేక పోలీసు బృందంతో దర్యాప్తు చేయించాలని షణ్ముగం డిమాండు చేశారు. గుండె కవాటాలలో ఏవైనా బ్లాకులు ఉంటే తెలుసుకోడానికి చేసే యాంజియోగ్రామ్ పరీక్షను అపోలో ఆసుపత్రి వైద్యులు చేయలేదని.. ముగ్గురు వైద్యులు అది చేయాలని చెప్పినా వారు వినిపించుకోలేదని ఆయన ఆరోపించారు. జస్టిస్ ఆర్ముగస్వామి కమిషన్ వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని కోరారు. యాంజియోగ్రామ్ అనేది ఇప్పుడు చాలా సర్వసాధారణమైన చికిత్స అని, దానికి ఎవరు తిరస్కరించారని అడిగారు. అమ్మను విదేశాలకు తీసుకెళ్లాలని తాము చాలాసార్లు సూచించామని.. కేంద్ర ప్రభుత్వం విమాన అంబులెన్సు ఇచ్చేందుకు కూడా ముందుకొచ్చిందని ఆయన అన్నారు. అయినా వీటన్నింటినీ ఎందుకు తిరస్కరించారో అర్థం కావడం లేదన్నారు. వైద్యుల పేరు కాపాడుకోవడం కంటే రోగి ప్రాణాలు నిలబెట్టడం చాలా ముఖ్యమని, అందువల్ల రాధాకృష్ణన్ నేపథ్యంపై కూడా దర్యాప్తు జరగాలని అన్నారు.

రాధాకృష్ణన్ అపోలో ఆసుపత్రి వర్గాలతో కుమ్మక్కై కుట్ర పన్ని జయలలితకు తగిన చికిత్స అందించలేదని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఇద్దరు అధికారులను జస్టిస్ ఆర్ముగస్వామి కమిషన్ తప్పుబట్టింది. కావాలనే తప్పుడు సాక్ష్యం ఇచ్చినందుకు నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని బాధ్యుడిగా చేసింది. తమ దర్యాప్తులో భాగంగా రాధాకృష్ణన్, రావులను కేసులో ఇంప్లీడ్ చేసేందుకు జస్టిస్ ఆర్ముగస్వామి తరపు న్యాయవాది మహ్మద్ జఫరుల్లాఖాన్ కోర్టు అనుమతి కోరారు. ఏకసభ్య కమిషన్ ముందు ఇద్దరు అధికారులు విభిన్న వాంగ్మూలాలు ఇచ్చారని ఆయన చెప్పారు.

అయితే తనమీద వచ్చిన ఆరోపణలన్నీ నిరాధారం, తప్పుడువని రాధాకృష్ణన్ ఖండించారు. కమిషన్ తరపు న్యాయవాది దాఖలుచేసిన పిటిషన్ కాపీ కావాలని కోరారు. అపోలో ఆసుపత్రితో తాను కుమ్మక్కై కుట్రపన్నానని, వాళ్ల అధికార ప్రతినిధిలా వ్యవహరించానని చేసిన ఆరోపణలు పూర్తిగా తప్పులని అన్నారు. ఆమెను చికిత్స కోసం విదేశాలకు తీసుకెళ్లాలా వద్దా అన్నది వైద్యపరమైన నిర్ణయమే తప్ప.. దానికి తనలాంటి అధికారులను బాధ్యులను చేయడం సరికాదని చెప్పారు. కమిషన్‌కు తన సమాధానం జనవరి 4న చెబుతానన్నారు.

పంచాయతీ చాటింపు

(మొదటిపేజీ తరువాయి)

ఓటు హక్కు ఉంటుందన్నారు. ఆ తరువాత చేర్చిన పేర్ల కోసం ప్రత్యేక జాబితా విడుదల చేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా అందచేస్తామన్నారు. 12751 గ్రామ పంచాయతీలలో మొత్తం 1 కోటి 49 లక్షల 52వేల మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రచారం చేసుకోవచ్చన్నారు. సర్పంచి జనరల్, బీసీ అభ్యర్థులు అయితే రూ.2వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అయితే రూ.1 వేయి డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. చేవెళ్లలో 19 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు నిర్వహించడం లేదని నాగిరెడ్డి ప్రకటించారు.

ఎన్నికల షెడ్యూల్...

తొలి విడత- జనవరి: 21
రెండో విడత- జనవరి: 25
మూడో విడత- జనవరి: 30
పోలింగ్ సమయం- ఉ. 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు
పోలింగ్ రోజే ఓట్ల లెక్కింపు
బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలు

మొదటి విడత జీపీలు: 4,480
రెండో విడత జీపీలు: 4,137
మూడో విడత జీపీలు: 4,115
మొత్తం గ్రామ పంచాయతీలు: 12,732
మొత్తం వార్డులు: 1,13,190

తేదీలు మార్చాలె..

తెలంగాణ పంచాయతీ ఎన్నికల నిర్వహణ తేదీలను మార్చాలని ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. తెలంగాణలో రెండో విడత సర్పంచ్ ఎన్నికల తేది జనవరి 25 ఉందని అది తమకు ఇబ్బందిగా అనిపిస్తుందంటున్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం ఉన్నందున పాఠశాలలో ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జనవరి 25న రెండో విడత ఎన్నికలు పెడితే గణతంత్ర దినోత్సవం ఏర్పాట్లకు ఇబ్బంది కలుగుతుందన్నారు. రెండో విడత తేదిని సవరించి జనవరి 27 గా మార్చాలని ఉపాధ్యాయ సంఘాలు ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశాయి. పాఠశాలలో విద్యార్థులకు ఆటలపోటిలు నిర్వహించాలని ఎన్నికలు ఉంటే రెండు రోజుల ముందు నుంచే ఎన్నికల అధికారులు పాఠశాలను తమ పరిధిలోకి తీసుకునే అవకాశం ఉందన్నారు. పిల్లలకు ఇబ్బంది కాకుండా జనవరి 27నే నిర్వహించాలని కోరారు.

మద్దతు డౌటే!

లఖ్‌నవూ, జనవరి 1: మూడు హిందీ రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏర్పాటు చేశామన్న సంబరం కాంగ్రెస్ పార్టీకి ఇంకా తీరకముందే.. ఆ పార్టీకి బీఎస్పీ అధినేత్రి మాయావతి పెద్ద షాకిచ్చారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో బీఎస్పీ మద్దతుతో ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఏప్రిల్ నెలలో జరిగిన దేశవ్యాప్త ఎస్సీ సమ్మెలో అమాయకులపై ఈ రెండు రాష్ట్రాలలో పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోకపోతే.. తాను ప్రభుత్వాలకు మద్దతు ఇచ్చే విషయమై పునరాలోచించాల్సి వస్తుందని మాయావతి హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కూడా బీజేపీలా పని చేయకూడదని.. వాళ్లు తమ హామీలను నెరవేర్చలేదని అన్నారు. కేవలం ప్రకటనలు చేస్తే సరిపోవడం లేదు కాబట్టే కాంగ్రెస్ పార్టీకి ఈ హెచ్చరిక జారీ చేయాల్సి వస్తోందని తాజాగా విడుదల చేసిన ఓ ప్రకటనలో మాయావతి అన్నారు. కాగితాల మీద హామీలు ఇవ్వడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకే తాను ముక్కలని ప్రజలు అనుకుంటున్నారని.. ఈ ఆలోచనా ధోరణిని మార్చగలమో, లేదో తేల్చుకోవాల్సింది కాంగ్రెస్ పార్టీయేనని ఆమె చెప్పారు. ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలో సుప్రీంకోర్టు కొన్ని మార్పులు చేయడంతో వాటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా.. ముఖ్యంగా ఉత్తర భారతంలో భారీ ఎత్తున ఆందోళనలు జరిగాయి. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ వాటికి మద్దతు కూడా తెలిపింది. మోదీ సర్కారు నుంచి రక్షణ కావాలని దళిత సోదరులు, సోదరీమణులు రోడ్డెక్కారని, వారికి సెల్యూట్ చేస్తున్నానని అప్పట్లో రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీతో ఎన్నికలకు ముందు పొత్తు పెట్టుకోడానికి నిరాకరించిన బీఎస్పీ అధినేత్రి మాయావతి.. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఈ రెండు రాష్ట్రాలలో బీజేపీని అధికారంలోకి రానివ్వకుండా ఆపేందుకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. దాంతో రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఉత్తర ప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ పార్టీకి బీఎస్పీ మద్దతు చాలా అవసరం అవుతుంది. ఆ రాష్ట్రం నుంచే అత్యధిక సంఖ్యలో లోక్‌సభకు సభ్యులను పంపే అవకాశం ఉన్నందున బీజేపీపై పోరాడాలంటే కాంగ్రెస్‌కు మాయ సాయం తప్పనిసరి. 2019 ఎన్నికలలో తన మద్దతు విషయాన్ని ఇంకా చెప్పీ చెప్పనట్లున్న మాయావతి.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీవైపే మొగ్గు కనబరిచారు. యూపీలో బీఎస్పీతో ఇప్పటికే పొత్తులో ఉన్న సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కూడా కాంగ్రెస్‌కు నిన్న మొన్నటి వరకు సానుకూలంగానే ఉన్నారు. కానీ.. ఇటీవల మధ్యప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చినా, తమ పార్టీ తరపున ఎన్నికైన ఏకైక సభ్యుడిని కమల్‌నాథ్ మంత్రివర్గంలో చేర్చుకోకపోవడంపై కినుక వహించారు. పదవి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. తర్వాత మాట మార్చిందని మండిపడ్డారు. తమ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వనందుకు కాంగ్రెస్ పార్టీకి కృతజతలు అంటూ గత వారం విలేకరులతో మాట్లాడుతూ ఎద్దేవా చేశారు. ఇలా చేయడం ద్వారా యూపీలో తమ దారెంటో కాంగ్రెస్ స్పష్టం చేసిందని అన్నారు. ఈ లెక్కన చూస్తే యూపీలో పొత్తులు తేడా రావడంతో పాటు.. ఇప్పటికే ఉన్న రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా కాస్త ప్రమాదంలో పడినట్లే కనిపిస్తోంది.

కేసీఆర్ ఫ్రంట్ విషయమే తెలియదు

(మొదటిపేజీ తరువాయి)

ఇలాంటి రాజకీయాన్ని జనం తిప్పికొడతారు. ఇది దేశం వర్సెస్ మహాకూటమి. తెలంగాణలో మహాకూటమి గతి ఏమైంది. అసలు మహాకూటమిపై చర్చించాల్సిన అవసరం లేదు. స్వార్థ ప్రయోజనాల కోసమే నాయకులు ఏకమవుతున్నారు. దేశ ప్రజలు బీజేపీతోనే ఉన్నారు. జీవితాంతం కాంగ్రెస్‌ను వ్యతిరేకించినవారు..వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చినవారంతా కలిసి మహాకూటమి అంటున్నారు. అలాంటి రాజకీయాలతో లాభం లేదు.' అని అన్నారు.

సర్జికల్ దాడులపై మోదీ

'ఆపరేషన్ విజయవంతమైనా, విఫలమైనా సూర్యోదయానికి ముందే వెనక్కి రావాలి'. ఇండియన్ ఆర్మీ ప్రత్యేక కమెండోలకు 2016 సెప్టెంబర్ 28న ఎల్ఓసీ వెంబడి పాక్ ఉగ్ర స్థావరాలపై సర్జికల్ దాడుల సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన సందేశమిది. తొలిసారి సర్జికల్ దాడులపై మోదీ పెదవి విప్పారు. భద్రతా దళాల భద్రతను దృష్టిలో ఉంచుకుని సర్జికల్ దాడుల తేదీల్లో రెండుసార్లు మార్పులు చేసినట్టు చెప్పారు. ఉరిలో చోటుచేసుకున్న ఉగ్రదాడుల్లో సైనికులు సజీవసమాధి కావడంతో సైన్యంలో ఉద్వేగం పెల్లుబికిందని, తాను సైతం ఉద్వేగానికి గురయ్యానని అన్నారు. ఆ నేపథ్యంలోనే సర్జికల్ దాడుల వ్యూహం రూపొందిందని చెప్పారు. 'విజయం సాధించినా, వైఫల్యమే ఎదురైనా పట్టించుకోను. సూర్యోదయానికి ముందే వెనక్కి వచ్చేయాలి అని సైన్యానికి స్పష్టమైన ఆదేశాలిచ్చాను' అని మోదీ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో మన సైనికులెవరూ మరణించకూడదనే స్థిరనిశ్చయం కారణంగానే తాను ఆపరేషన్ విఫలమైనా గడువు మాత్రం పొడిగించకుండా ముగించుకుని రావాలని కోరడం జరిగిందన్నారు. 'సర్జికల్ స్ట్రైక్స్ అనే ఆపరేషన్ చాలా రిస్క్‌తో కూడిందని నాకు తెలుసు. రాజకీయ రిస్క్ గురించి నేనెప్పుడూ పట్టించుకోను. అయితే సర్జికల్ దాడుల విషయంలో మాత్రం ఆపరేషన్ సక్సెస్, వైఫల్యాలతో సంబంధం లేకుండా సైనికుల భద్రత విషయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాను' అని మోదీ తెలిపారు.

ఉద్విగ్నఘట్టం...

'ఆ రోజు ఉదయం ఒక గంటపాటు సమాచారం ఆగిపోయింది. దాంతో నాలో ఆతృత పెరిగిపోతూ వచ్చింది. సూర్యోదయమైన గంట తర్వాత కూడా నా పరిస్థితిలో మార్పు రాలేదు. రెండు నుంచి మూడు యూనిట్లు సురక్షిత జోన్‌లోకి వచ్చినా ఆపరేషన్‌లో పాల్గొన్న అందరూ అప్పటికి ఇంకా వెనక్కి రాలేదు. ఆపరేషన్ పూర్తయి అంతా సురక్షితంగా వెనక్కి వచ్చేంతవరకూ నేను ఊపిరిపీల్చుకునేది లేదని చెప్పా' అంటూ మోదీ అప్పటి ఉద్విగ్న పరిస్థితిని వివరించారు.

ప్రజలు-మహాకూటమి మధ్యే సార్వత్రిక ఎన్నికలు

బీజేపీ వ్యతిరేక పార్టీల ప్రతిపాదిత 'మహాకూటమి'పై ప్రధాని నరేంద్ర మోదీ విసుర్లు విసిరారు. 2019 సార్వత్రిక ఎన్నికలను 'ప్రజలు-మహాకూటమి' మధ్య జరిగే పోటీగా ఆయన అభివర్ణించారు. లోక్‌సభ ఎన్నికల్లో 543 స్థానాలకు గాను 180 కంటే ఎక్కువ సీట్లు బీజేపీ తెచ్చుకోలేదంటూ కొందరు రాజకీయ పండితులు చేస్తున్న వాదనల్లో పస లేదని అన్నారు. 2014లోనూ కొద్ది మంది వ్యక్తులు ఇలాంటి అంచనాలే వేశారని అన్నారు. గత నాలుగున్నరేళ్లలో తమ ప్రభుత్వం చేసిన పనులను పరిగణనలోకి తీసుకుని ప్రజలు మరోసారి బీజేపీపై నమ్మకం చాటుకుంటారని తాను బలంగా నమ్ముతున్నట్టు ప్రధాని చెప్పారు.

కూటమి ఓటమికి ఉత్తమ్, రమణలే కారకులు



- మితి మీరిన విశ్వాసమే ఓడగొట్టింది
- ఫ్రంట్ పాలిట శాపంగా వారిద్దరి ఒంటెద్దు పోకడలు
- కూటమిలోనే కొనసాగుతం.. ఎవరితోనూ కలవం
- ఫెడరల్ ఫ్రంట్ ఎందుకు పెడుతున్నర్రో కేసీఆర్ చెప్పాలె
- పంచాయతి ఎన్నికల్లో ఎక్కువ సీట్ల సాధనకు యత్నాలు
- నాకు రాజ్యసభ సీటు ఇస్తారని వస్తున్నవార్తలు అవాస్తవం
- మీడియాతో చిట్‌చాట్‌లో కూటమి కన్వీనర్ కోదండరాం

హైదరాబాద్, జనవరి 01, (మనం ప్రతినిధి): తెలంగాణలో కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రజా కూటమి ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం మూట గట్టుకుని, నాలుగు వారాలు గడిచినా ఇంకా తేరుకున్నట్లు కనిపించడం లేదు. కాంగ్రెస్, టీడీపీ, తెలంగాణ జనసమితి పార్టీలన్ని మూకుమ్మడిగా ఎకమైన అధికార పార్టీ ముందు బొక్క బోర్లా పడక తప్పలేదు. జరిగిన ఆనార్ధాన్ని, తప్పులను బేరిజు వేసుకోని...ఓటమి ఊసుల నుంచి బయటపడేందుకు కాంగ్రెస్ పార్టీ మాత్రం ఓ అడుగు ముందుకేసి కొద్దిగా తేరుకుని నష్ట నివారణ చర్యలు, సమీక్షలకు దిగింది. కాంగ్రెస్ సమీక్షల్లో అసలు అంశాలను కాకుండా ఇతర అంశాలపై చర్చలు చేస్తున్నట్లు తెలంగాణ జన సమితి భావిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హైదరాబాద్‌లోని నాంపల్లి టీజేఎస్ కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కోదండరాం సంచలన విషయాలను బయటపెట్టారు. జరిగిన నష్టంపై అగ్ర పార్టీలన్నింటి కంటే ఓ అడుగు ముందుకేసి ఆయన ఆసక్తికర కామెంట్స్ చేశారు. అయితే, కూటమి ఓటమికి కొందరు నేతల అతి కారణంగానే ఓడి పోయామని ఓటమికి గల కారణాలను బట్ట బయలు చేశారు. అయితే, ముఖ్యంగా ప్రజా కూటమిలోని కొంతమంది నేతల (కాంగ్రెస్, టీడీపీ) ఓవర్ కాన్ఫిడెన్స్ కారణంగా ఘోర పరాజయం చవిచూడాల్సి వచ్చిందంటూ హితవు పలికారు. ఓటమికి ఈవీఎంలను బూచిగా చూపడం సరికాదని కోదండరాం ఘంటాపథంగా ముక్కుసూటిగా తెగేసి చెప్పారు. ఇక, ఫలితాలు వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ ఈవిఎంలను తప్పు పట్టడం, ఈవిఎంల ట్యాంపరింగ్‌తోనే ఓడిపోయామని చెప్పడంలో ఎ మాత్రం అర్థం లేదన్నారు. అవి అర్థం పర్థం లేని మాటలేనంటే ఆయన కొట్టి పారేశారు. ముఖ్యంగా ఓటమి గల అసలు కారణాలను సమీక్షించకుండా కొత్త విషయాలను తెరపైకి తెస్తు...ఉత్తుత్తి కారణాలపై విశ్లేషణ చేయడం ఎ మాత్రం బావ్యం కాదని, వాటితో వచ్చే లాభం కూడా ఎది ఉండబోదన్నారు.

ఇదిలా ఉంటే, తాను ఉద్యమ సమయంలో గానీ, ఉద్యమానికి ముందు గానీ, కేసీఆర్‌తో పదేళ్లపాటు కలిసి పనిచేశానన్నారు. తాను కేసీఆర్ ప్రచార శైలిని అత్యంత దగ్గరనుంచి చూసిన వ్యక్తిగా చూశానని, అదే విషయాన్ని కూటమి పార్టీలోని అగ్ర నేతలందరికి చెప్పానని, కొన్ని సార్లు, వారించానని, కొన్ని సార్లు గట్టిగానే హెచ్చరించినా కూడా కూటమిలోని కీలక నేతలైన టీ.కాంగ్రెస్ చీఫ్ ఉత్తమ్, టీడీపీ చీఫ్ ఎల్.రమణ అస్సలు నా మాట వినిపించుకోలేదని కోదండ రాం ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి భాగస్వామ పక్షాలు ఓటమికి గల కారణాలపై, అబ్యర్థుల నడవడికపై తెలంగాణ జన సమితి పార్టీగా పూర్తి స్థాయిలో తాము ఒక విశ్లేషణ చేస్తున్నమన్నారు. ఓటమికి రాజకీయ పరమైన వైఫల్యాలను చర్చించకుండా సమీక్షలు జరపడం సరికాదన్నారు. కేసీర్ ఎన్నికల ప్రచార సరళి ఎలా ఉంటుందో నాకు తెలుసని చెప్పినా వినిపించుకోలేదని పైగా రకరకాల కామెంట్స్ చేశారని కూటమి తప్పిదాలను కోదండ రాం బహిర్గతం చేశారు. ముఖ్యంగా కూటమిలో సీట్ల సర్దుబాటు త్వరగా తేల్చాలని తాను ఎంత చెప్పినా వారు వినలేదు సరికదా? కొన్ని సార్లు మా మాటను పట్టించుకోలేదని కుండ బద్దలు కొట్టినట్లు కూటమి రంగును బయటపెట్టారు. మహా కూటమికి సైతం ఒక నెలకు పైగా సమయం ఉంటే తప్ప కేసీఆర్‌ను ఎదుర్కోలేమని చెప్పానని, అయినా వారే ఆలస్యం చేశారని చెప్పారు. పైగా ప్రచారానికి మూడు వారాలు చాలు అని టీ.కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్ మాట్లాడారని ఆయన తెలిపారు. ఇక, కేసీఆర్‌పై భారీ వ్యతిరేకత ఉందని, ప్రజా కూటమి పార్టీకి అంత సమయమేందుకని...ఓ రెండు వారాలు చాలని కాంగ్రెస్, టీడీపీ నేతలు వారించారన్నారు. ఈ సందర్భంగా కూటమి పార్టీకి బాగస్వామ్య పార్టీల నేతల తప్పిదాలతోనే భారీ ఓటమికి కారణమయ్యి ఉంటుందని ఆయన వివరించారు. కూటమి ఆభ్యర్థులేవ్వరు ఇంటింటి ప్రచారం అస్సలు చేయలేదని అ దిశగా కొందరు కూడా ప్రయత్నమే చేయకపోగా, కనీసం అగ్ర నేతల నుంచి కూడా ఎ ప్రయాత్నాలు జరుపలేదని ఖరకండిగా చెప్పారు. తామంతా కేవలం సభలు, సమావేశాలతోనే ప్రచారం ముగించడంతో మహా కూటమిగా ప్రజల్లోకి,గానీ కనీసం మారు మూల పల్లేల్లోకి కూడా తమ ప్రచారం పోలేదని అనిపిస్తుందన్నారు. దాంతోనే తమ కూటమికి భారీ ఓటమి తప్పలేదన్నారు. అన్నింటికంటే, ముఖ్యంగా తమ మహా కూటమి ఎజెండా, మేనిఫెస్టో బాగానే ఉన్నప్పటికి..తాము ప్రవేశ పెట్టబోయే ఎన్నికల హామీల ప్రణాళిక, ముసాయిదాను జనాల్లోకి తీసుకెళ్లలేకపోయామన్నారు. ఇక, ప్రచారంలో సైతం ఎవరు ఎక్కడ పాల్గొనాలి అనేదాన్ని అంచనా వేయలేకపోయామన్నారు. ముఖ్యమైన నేతలను కూడా రాహుల్ సభల్లో ప్రసంగాలు చేయించడం వరకే పరిమితం చేశారన్నారు. అలా కాకుండా ఇతర ప్రదేశాల్లో కూడా ప్రచారం చేయిస్తే...బావుండేందన్నారు.

ఇదిలా ఉంటే కేసీఆర్ తెర మీదకు తెచ్చిన ఫెడరల్ ఫ్రంట్ అనేది సాధ్యం ఇప్పుడున్న పార్టీలతో, గానీ, ఈ సమయంలో అది అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఫెడరల్ ఫ్రంట్ పెరుతో కేసీఆర్ చేస్తున్న హడావిడి తప్పా? ఎక్కడా కూడా వివిద రాష్ట్రాల్లో ఫ్రంట్‌ను గట్టిగా స్వాగతించినట్లు గానీ, జాతీయ పార్టీలపై ఆయన చేసే విమర్శలను ప్రజలు, పార్టీలు నమ్మే ప్రసక్తే లేదన్నారు. ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కే సీఆర్ చేస్తున్న రాజకీయాల వెనుక ఎవరేవరున్నారో దానిపై తమకు ఇంకా పూర్తి వివరాలు తెలియదని ఆయన చెప్పారు.



రాజ్‌భవన్‌లో కొత్త సంవత్సర వేడుకలు

హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిది) :రాజ్‌భవన్‌లో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్నర్ నరసింహన్ దంపతులకు పలువురు ప్రముఖులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ హోంమంత్రి మహమూద్ అలీ, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్, మాజీ డీజీపీ అనురాగ్ శర్మతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, చిన్నారులు రాజ్‌భవన్‌కు చేరుకొని గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖుల రాకతో రాజ్‌భవన్ వద్ద సందడి వాతావరణం నెలకొంది.

హోంమంత్రికి శుభాకాంక్షలు

- మర్యాద పూర్వకంగా కలిసిన పోలీసు అధికార్లు



హైదరాబాద్, జనవరి 01, (మనం ప్రతినిధి): తెలంగాణ హోం మంత్రి మహమ్మద్ మహముద్ అలీని పోలీస్ ఉన్నాతాధికారులు కలిశారు. ఈ సందర్భంగా మంగళవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకోని రాజధానిలోని జంట కమిషనరేట్‌లా కమిషనర్లు పోలీస్ కమిషనర్స్ హోం మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా పోలీసు అధికారులు మహముద్ ఆలీని కలిసి పూష్ప గుచ్చాలను అందజేచేసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లు, ఉన్నతాధికారులున్నారు.

మహముద్ ఆలీని కలిసిన నరసింహాచార్యులు



తెలంగాణ హోం మంత్రి మహమ్మద్ మహముద్ అలీని తెలంగాణ అసెంబ్లీ సెక్రేటరి నరసింహ్మాచార్యులు మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా మంగవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకోని శాసన సభ కార్యదర్శి చారీ హోం మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతూ.. పుష్ప గుచ్చాలను అందజేశారు.

బొకేలు వద్దు.. దుప్పట్లు, స్వెట్టర్లు తెండి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ సరికొత్త నిర్ణయం
- చలికి వణుకుతున్నవారిని ఆదుకుంటున్నదివ్య దేవరాజన్



హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిధి) : నూతన సంవత్సరం సందర్భంగా తన వద్దకు వచ్చే వారు బొకేలు, ఫ్లవర్లు తేవద్దని వాటి స్థానంలో దుప్పట్లు, కోట్లు తీసుకురావాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కోరారు. అనేక మంది ఇళ్లు లేని వారంతా రోడ్ల పైనే రాత్రిళ్లు నిద్రిస్తున్నారన్నారు. వారి కోసం నైట్ షెల్టర్లు ఏర్పాటు చేశాము, అందులో ఉండే వారికి దుప్పట్లు, స్వెట్లర్లు అందించవలసి ఉంది అని ఆమె అన్నారు. రోడ్ల పై చాలా మంది చలికి ఒణుకుతూ ఉంటారని అటువంటి వారికి దుప్పట్లు అందించి సాయమందించాలన్నారు. హాస్టల్‌లోపిల్లలకుకూడా ప్రభుత్వం తరపున దుప్పట్లు అందజేశామని మరికొంత మంది ముందుకు వస్తే ఇంకొంత మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయవచ్చన్నారు. ఆదిలాబాద్ లో మైనస్ డిగ్రీలలో ఉష్ణోగ్రత స్థితి పడిపోయిందన్నారు.

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా దివ్య దేవరాజన్ గత రెండు సంవత్సరాల నుంచి పని చేస్తున్నారు. ఆమె పాలనలో తనదైన మార్క్ వేసుకొని ప్రజలకు దగ్గరయ్యారు. ఆమె నిర్ణయాలన్నీ సామాన్య ప్రజానీకానికి అనుకూలంగా ఉంటాయి. ఇటీవలజరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఓటు వేయడానికి వచ్చే గర్బిణీ స్త్రీలకు, వృద్దులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దివ్య దేవరాజన్ చేసిన ఏర్పాట్లను చూసి ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అధికారులు మెచ్చుకున్నారు. దివ్యదేవరాజన్ చాలా సింప్లిసిటిగా ఉంటారు. తెలంగాణలో కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత వికారాబాద్ జిల్లాకు కలెక్టర్ గా దివ్య నియమితులయ్యారు. ఆ తర్వాత లంబాడా, గోండు తెగ ప్రజల మధ్య రిజర్వేషన్ల చిచ్చు రగలడంతో ఆదిలాబాద్ లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అప్పుడు ప్రభుత్వం అక్కడ గొడవలు సద్దుమణిగించేందుకు దివ్య దేవరాజన్‌ను ఆదిలాబాద్ కలెక్టర్‌గా బదిలీ చేసింది. దివ్య కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాత్రింబవళ్లు పని చేసి అక్కడ పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చారు. దివ్యదేవరాజన్ కలెక్టర్ గా గ్రామాల పర్యటనకు వెళ్లినప్పుడు ప్రజలు ఆమెతో సమస్యలు చెప్పుకోవడానికి ముందుకు రాలేకపోయేవారు. దీనికి కారణం భాష అని గమనించిన దివ్య ఓ ట్యూటర్ ను పెట్టుకొని గోండు భాష నేర్చుకు న్నారు. ఆ తర్వాత ఆమె ప్రజలతో మమేకమైపోయారు. దివ్యదేవ రాజన్ నిత్యం ప్రజలల్లో ఉంటూ ప్రజాసంక్షేమం కోసం పాటుపడ్డారు. తాజాగా కొత్త సంవత్సరం సందర్బంగా దివ్య తీసుకున్న నిర్ణయం పై అంతా ఆనందం వ్యక్తం చేశారు. కలెక్టర్ దివ్యకు అంతా అభినందనలు తెలియజేశారు.

ఓడినా కాంగ్రెస్‌కు బుద్ధి రాలేదు



- దానం నాగేందర్

హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిది): ఎన్నికల్లో ఘోరంగా ఓడినా కాంగ్రెస్ నేతలకు బుద్ధి రాలేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటమికి గల కారణాలపై విశ్లేషించకుండా ఈవీఎంలపై నెట్టివేస్తూ, లేనిపోని సాకు చూపుతున్నారని మండిపడ్డారు. ఓడిపోతే గాంధీభవన్‌కు రానని ఎన్నికలకు ముందు సవాల్ చేసిన ఉత్తమ్ మాట తప్పారని విమర్శించారు. సీఎం కుర్చీ కోసం కలలు కనడం తప్ప, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఉత్తమ్ ఏనాడు పాటుపడలేదన్నారు. ఆయన సమర్థుడైన నాయకుడు అయితే, భార్య పద్మావతి రెడ్డి కోదాడ నుంచి ఎందుకు ఓటమి పాలవుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలకు బీసీల గురించి మాట్లాడే అర్హత లేదని ఆయన అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జోలికి తాము వెళ్లలేదని, ఆయనే తెలంగాణకు వచ్చి లేనిపోని ప్రచారం చేశారని అన్నారు. ఫెడరల్ ఫ్రంట్‌పై స్పష్టత లేదంటున్న చంద్రబాబు, వారి ఫ్రంట్‌కు ఏమీ బలం ఉందో చెప్పాలని దానం నాగేందర్ నిలదీశారు.

కేటీఆర్‌కు శుభాకాంక్షలు వెల్లువ

తెలంగాణ భవన్‌కు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు

- వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన మ్యూజిక్ డైరెక్టర్
- కేటీఆర్‌పై రామలింగం రాసిన పాటను ఆవిష్కరించిన కోటి



హైదరాబాద్, జనవరి 01, (మనం ప్రతినిధి): యంగ్ లీడర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తాజా మాజీ మంత్రి కేటీఆర్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా మంగళవారం తెలంగాణ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు భారీ ఎత్తున జరిగాయి. పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కేటీఆర్ కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకి చెందిన పలువురు అగ్ర నేతలు, మ్యూజిక్ డైరెక్టర్ కోటి, గాయకురాలు బేబి కేటీఆర్‌ను కలిశారు. రచయిత రామలింగం కేటీఆర్‌పై రాసిన పాటను వర్ధమాన గాయకురాసు బేబి..సీనియర్ సింగర్ మనో పాడిన పాటను మ్యూజిక్ డైరెక్టర్ కోటి తెలంగాణ భవన్‌లో ఈ సందర్భంగా విడుదల చేశారు.

కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి..

అంతకు ముందు టీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వహకాధ్యక్షుడు కల్వకుంట్ల తార క రామరావు మాట్లాడుతూ...శుభాకాంక్షలు తెలిపిన అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు 2019 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరం 2019 కోటి ఆశలు, కొంగొత్త ఆశయాలతో మొదలై, అందరి లక్ష్యాలను నెరవేర్చాలని కేటీఆర్ ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ నేతత్వంలో తెలంగాణలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభమై, రాష్ట్రం దేశంలో అగ్రగామిగా నిలుస్తుందని ఆయన చెప్పారు. కేసీఆర్ చెపట్టబోయే బంగారు తెలంగాణ మహా యజ్ఞంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నట్లు కేటీఆర్ ఆకాంక్షించారు. ఇక, మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మారెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజానికానికి శుభాకాంక్షలు తెలుపుతూ ఒక ప్రకటనను విడుదల చేశారు. కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం సుబీక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన చెప్పారు.

మహేందర్ రెడ్డికి ఆర్‌టీసీ అధికారుల శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర, రవాణ శాఖ మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డికి ఆర్టీసీ అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకోని ఆర్‌టీసీ ఎండీ సునీల్ శర్మ, ఈడీలు పురుషోత్తం నాయక్, వినోద్ కుమార్, రవిందర్, కష్ణకాంత్‌లు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

రైల్వేకు కొత్త రూపు



- ప్రధాని మోదీ దార్శనికతతోనే అభివృద్ధి
- నాలుగన్నరేండ్లలో ప్రేరణాత్మక కృషి
- ప్రపంచ స్థాయి దిశగా అడుగులు
- వినియోగదారుల సంతృప్తే లక్ష్యం
- రైల్వే బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వినోద్ కుమార్ యాదవ్

హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిది) : రైల్వే బోర్డు ఛైర్మన్‌గా వినోద్ కుమార్ యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆయన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా ఉన్నారు. సికింద్రాబాద్ రైల్ నియంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం యాదవ్ మీడియాతో మాట్లాడారు. రైల్వే బోర్డు ఛైర్మన్‌గా ఆయన భారత ప్రభుత్వ ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రెటరీ స్థాయిలో విధులు నిర్వహిస్తారు.

ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు భారతీయ రైల్వే కృషి చేస్తున్నదని అన్నారు. రైల్వే మంత్రి పీయూష్ గోయల్ మన రైల్వేని ప్రపంచ స్థాయి సాధించే దిశగా నడిపించాల్సిన విభాగంగా గుర్తించారని వెల్లడించారు. గత నాలుగున్నరేండ్లలో రైల్వే ప్రగతికి గొప్ప ప్రేరణ ఇవ్వడం జరిగిందని, భవిష్యత్‌లో ఇదే విధంగా కొనసాగుతుందన్నారు. భారతీయ రైల్వేలో భద్రత కు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, రైలు మార్గాల పున ర్నిర్మాణం, నిర్వహణ, రైలు పట్టాల మార్పు తదితర పనులు వేగంగా పూర్తి చేసే కృసి జరుగుతుందని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యతనిచ్చి రైలు వినియోగదారుల, సంతృప్తి సంతోషాల కోసం ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి ధ్యేయంగా హైస్పీడ్ బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు, సెమి హైస్పీడ్, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు, కొత్త రైల్వే మార్గాలకు సంబంధించిన పనులు, డబ్లింగ్, ట్రిప్లింగ్ రైలు మార్గాల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుతున్నదన్నారు. ఉద్యోగులే రైల్వే సంస్థకు వెన్నెముక అని వారి సంక్షేమం దృష్టిలో ఉంచుకొని వారు పనిచేసే ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించడం, వృత్తిశిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం వంటి ప్రయత్నాలు మరిన్ని చేపట్టవలసి ఉందని రైల్వే బోర్డు ఛైర్మన్ వినోద్ చెప్పారు.



కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం

- అర్ధరాత్రి జిల్లాలో మిన్నంటిన సంబరాలు
- శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, ప్రజా ప్రతినిధులు

జనగామ డిసెంబర్ 31 (మనం న్యూస్ ప్రతినిది): 2018 సంవత్సరం ఎంతో అనందంతో, కొన్ని ఒడిదుడుకుల మద్యసాగిన 2018 సంవత్సనంలో 12 నెలల చక్రభ్రమణంలో తన చరిత్రను జ్ఞాపకంగా మిగిల్చివెళ్లింది. గతానికి వీడ్కోలు పలికింది. కొత్త సంవత్సరం కోటి ఆశలతో వచ్చేసింది. సోమవారం ఆయా పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులు 2018 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2019 సంవత్సరానికి స్వాగతం పలికి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్దరాత్రి జిల్లాలో సంబరాలు మిన్నంటాయి. కేక్‌లు కట్ చేసి జనం ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజా ప్రతినిదులు అధికారులు కొత్త సంవత్సర ప్రణాళికలు వేసుకుంటున్నారు...

చిన్నప్పటి నుంచే క్రమ శిక్షణ నేర్పించాలి

- సంక్షేమ హాస్టల్‌ను సందర్శించిన డీఎస్పీ విజయ్‌కుమార్



హైదరాబాద్, జనవరి 01, (మనం ప్రతినిధి): ఉన్నత చదువులు చదువుకుని ప్రతి ఒక్కరు జీవితంలో స్థిరపడాలని...అందుకు అ దిశగా ఇప్పటి నుంచే అ ప్రయాత్నాలు మొదలుపెట్టాలని సిఐడి డిఎస్పి విజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన యూసప్ గూడలోని సాంఘిక సంక్షేమ బాలుర కాలేజీ హస్టల్‌ను మంగళవారం సందర్శించారు. అనంతరం విజయ్ కుమార్ హస్టల్‌లో విద్యార్థులకు అందించే వసతి, సౌకర్యలను ఆయన పరిశీలించారు. ఈ సంధర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ...విద్యార్ధులకు చిన్నప్పటి నుండి క్రమశిక్షణ అవసరమని చెప్పారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకోని ఉన్నత స్థాయిలో విధ్యను అభ్యసించాలని ఆయన సూచించారు. విద్యార్ధులతో ముచ్చాటించాక అనంతరం సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఇందులో బాగంగా స్వేరో గోడ పత్రికను విద్యార్థుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అందోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అప్పజిపల్లి సురేష్, విద్యార్ధులు సుధాకర్ ,శ్రీనివాస్, రాజుకుమార్,దాసు,తదితరులు పాల్గొన్నారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

బుధవారం, జనవరి 2

హసీనా ఘనవిజయం

నూతన సంవత్సరం ప్రారంభం రోజున పొరుగుదేశం నుంచి భారత్‌కు తియ్యటి కబురు అందింది. పొరుగుదేశమైన బంగ్లాదేశ్‌లో 11వ సార్వత్రిక ఎన్నికల్లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ మూడోసారి జయకేతనం ఎగరవేసి, దేశ పాలనా బాధ్యతలను స్వీకరించనున్నది. మొత్తం 300 స్థానాల్లో 288 పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవడం ద్వారా మూడింటి రెండొంతుల మెజారిటీని సాధించి సరికొత్త రికార్డును నెలకొల్పింది. జాతీయ ఒయ్‌కియా ఫ్రంట్ పేరుతో అవామీ లీగ్‌పై పోటీచేసిన ఐక్యం సంఘటన ప్రతిపక్షం సహజంగానే ఎన్నికల్లో ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తోంది. ఈ కూటమిలో ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషలిస్టు పార్టీ కూడా భాగస్వామిగా ఉన్నది. హసీనాకు దేశవ్యాప్తంగా మద్దతు లభించిందని, ఆమె ఆర్థిక విధానాలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి. కొత్తగా ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు ఈ నెల మూడో తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 2017లో పాకిస్థాన్ నమోదుచేసిన తలసరి జీడీపీని బంగ్లాదేశ్ అధిగమించింది. తాను అనుసరించిన ఆర్థిక విధానాలు, సామాజిక విధానాలపై ప్రజాతీర్పును కోరుతూ హసీనా ఎన్నికలకు వెళ్లారు. గత ఎన్నికల్లో 2014లో ఆమె పార్టీ సాధించిన 284 స్థానాలకంటే ఈసారి ఎక్కువ స్థానాల్లో విజయం నమోదు చేయడం గమనార్హం.


అయితే, షేక్ హసీనాకు ఈ విజయం నల్లేరు మీద నడకగా తలవకూడదు. దేశంలో చెలరేగుతున్న అల్లర్లను, ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను అంత తేల్గ్గా తీసేయదగినవి కావు. విదేశీ పరిశీలకులలో ఏర్పడిన ఎన్నికల పర్యవేక్షణ వేదిక అందించిన ప్రాథమిక సమాచారం మేరకు ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగాయి. అయితే, ఎన్నికల అనంతరం హింస చెలరేగిన నేపథ్యంలో ప్రతిపక్షాలకు చెందిన అనేక వెబ్‌సైట్లను నిషేధించారు. వేలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఏదేమైనా హింసాకాండపై ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాల్సి ఉన్నది. ఏది ఏమైనా తనలోని లోటుపాట్లను చక్కదిద్దుకుని, చట్టాన్ని గౌరవించేలా చర్యలు తీసుకోవడం ప్రస్తుతం హసీనా ముందున్న సవాలని చెప్పక తప్పదు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల నుంచి తమ పార్టీ కార్యకర్తలను నిషేధించిన నేపథ్యంలో బంగ్లాదేశ్ నేషలిస్టు పార్టీ తరపున విజయం సాధించిన పార్లమెంట్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు కనిపించడ లేదు.

వాస్తవం చెప్పుకోవాలంటే షేక్ హసీనాకు లౌకిక విధానంపై విశ్వాసం ఉండడం భారత్‌కు శుభసూచికం. గత హసీనా ప్రభుత్వ హయాంలో 1971 బంగ్లాదేశ్ ఆవిర్భావ సమయంలో జరిగిన యుద్ధ నేరస్తులపై చర్యలు చేపట్టింది. అలాగే, ప్రజాస్వామ్య విధానాలను పుణికిపుచ్చుకునేలా బంగ్లాదేశ్ రాజ్యాంగానికి సవరణలు కూడా హసీనా చేపట్టారు. హసీనా హయాంలో భారత్–బంగ్లాదేశ్ దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయి. అంతేగాక, ఇస్లామిక్ టెర్రరిస్టులు, స్థానిక టెర్రరిస్టుల కార్యకలాపాలపై హసీనా కఠిన చర్యలు తీసుకోవడం కూడా చెప్పుకోదగిన అంశమే. భారత్‌తో రైల్వే, విద్యుత్, మౌలిక సదుపాయాలు, విద్య, జలరవాణా తదితర అంశాలపై కుదుర్చుకున్న ఒప్పందాలు షేక్ హసీనా పట్ల భారత్ పాలక పార్టీ దృష్టిలో ఆమె గెలుపు రెండు దేశాల మధ్య మరింత సన్నిహిత సంబంధాలు కల్పించగలదన్న ఆశాభావంతో భారత్ ఉన్నది. ఈ విధంగా రెండు దేశాల మధ్య మరింత సుహృద్భావ వాతావరణం ఏర్పడి, దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలకు పరిష్కారం లభించగలదని భారత్ భావిస్తోంది. పార్టీ సాధించిన ఈ విజయంతో రెండు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్యబంధం మరింత శక్తిమంతం కాగలదని భారత్ భావిస్తోంది.

పొరుగుదేశంలో జరిగిన ఎన్నికల ఫలితాల కోసం భారత్ ఎంతో ఆతృతతో ఎదురుచూసింది. ఈ ఫలితాల ప్రభావం మరో రెండుమూడు నెలల్లో భారత్ సార్వత్రిక ఎన్నికలపై పడుతుందని పాలకపక్షం ఆశాభావంతో ఉన్నది. ఏదేమైనా 2014లో ఉన్న మాదిరిగా ఈసారి 2019 ఎన్నికల్లో బీజేపీపైన, ప్రధాని నరేంద్ర మోదీపైన ప్రజల విశ్వాసం సడలుతోందనే ప్రచారం నేపథ్యంలో పొరుగుదేశ ఎన్నికల ఫలితాల సరళే ఇక్కడ కూడా పునరావృతం కాగలదని భారత్‌లోని పాలకపక్షం ఆశతో ఎదురుచూస్తోంది. ఈ ఎన్నికల ఫలితాల ప్రభావం సహజంగానే పొరుగుదేశమైన భారత్‌పై ఉండే అవకాశాలున్నాయని, అదీ బంగ్లాదేశ్‌లో పాలకపక్షం విజయంతో భారత్‌లో కూడా తమ విజయం ఖాయమేనని బీజేపీ, దాని మిత్రపక్షాలు భావిస్తున్నాయి. ప్రతిపక్షం ఆరోపించిన విధంగా అధికారుల నిరంకుశ విధానాలు నిజమయ్యే పక్షంలో బంగ్లాదేశ్‌లో మళ్లీ టెర్రరిస్టుల ఉనికి కనిపించే ప్రమాదం ఉందని ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది.



మంచిమాట



మనం చీకట్లో ఉన్నామనే భావన కలిగినప్పుడు వెలుతురు వైపు చూసే ప్రయత్నం చేయాలి

\- అరిస్టాటిల్

వినియోగదారుల సంక్షేమమే కీలకం

స్వాతంత్రం తర్వాత భారతదేశ చరిత్రలో అతిపెద్ద పరోక్ష పన్నుల సంస్కరణగా వస్తు సేవల పన్ను నిలిచిపోయింది. దీని అమలుతో దేశమంతటా పరోక్ష పన్నులు ఒకే గొడుగు కిందకు వచ్చాయి. ఇది దేశమంతటా తయారీదారుల నుంచి వినియోగదారులు వరకు వస్తు, సేవల సరఫరా మీద విధించే సమగ్రమైన పన్ను జీఎస్టీ. తయారీ దారి మొదలుకొని అంతిమ వినియోగం వరకూ ప్రతి దశలో అంటే ఉత్పత్తిదారులు నుంచి వినియోగదారులు వరకు వస్తువు లేదా సేవలను జోడించు విలువపై విధించే విలువ ఆధారిత పన్ను.

జీఎస్టీ ద్వారా ఏకీకృత జాతీయ మార్కెట్ స్థాపనకు మార్గం సుగమం అయింది. ఈ విధానం వల్ల పన్ను మీద పన్ను భారం తొలగించబడి గణనీయంగా తగ్గి అంతిమ వినియోదారుల వరకు లబ్ధి కలుగుతుంది.

వినియోగదారుల ప్రయోజనాలు బదిలి - ప్రభుత్వం తీసుకున్న చర్యలు:

వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటానికి జీఎస్టీ చట్టంలో ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నది.

యాంటీ ప్రాఫిటీరింగ్ అథారిటీని ఏర్పాటు చేసింది. ఈ అథారిటీ వినియోగదారునికి జీఎస్టీ ప్రయోజనాలు చేరుతున్నాయా లేదా అని పర్యవేక్షిస్తుంది.

వినియోగదారునికి నిర్దిష్ట పరిస్థితుల్లో ఏదైనా రిఫండ్ కోసం దరఖాస్తు వస్తే నిర్దిష్ట మొత్తం వినియోగదారు సంక్షేమం నిధికి బదిలీ అవుతుంది. ఈ నిధి ద్వారా ప్రభుత్వం వినియోగదారులకు జీఎస్టీపై అవగాహన కల్పిస్తుంది.

GSTIN ఉన్న ప్రతి నమోదిత వ్యాపార లేదా సేవా సంస్థలు ప్రతి లావాదేవీకి టాక్స్ ఇన్వా యిస్ జారీ చేయవలసి ఉంటుంది.

టాక్స్ ఇన్వాయిస్‌లో వస్తువులు లేదా సేవల విలువ, ఆ వస్తువులు లేదా సేవలపై వసూలు చేసిన జీఎస్టీ తదితర అంశాలతో పాటు ఇతర అంశాలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది.

టాక్స్ ఇన్ వాయిస్ విలువ 200 రూపాయల కంటే ఎక్కువగా ఉంటే వినియోగదారులకు తప్పనిసరిగా ఇన్వాయిస్ ఇవ్వవలసి ఉంటుంది.

జీఎస్టీ కింద వ్యాపార లేదా సేవా సంస్థలు నమోదైన తన జీఎస్టీ నెంబర్‌ను తమ వ్యాపార సంస్థ ఆవరణలో ప్రముఖంగా కనిపించేలా ప్రదర్శించడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. తద్వారా ఆ వ్యాపారి జీఎస్టీ కింద నమోదైనదా లేదా అనే విషయాన్ని వినియోగదారునికి స్పష్టం చేసినట్లు అవుతుంది.

జీఎస్టీ పథకంలో నమోదు కాని వ్యాపార లేదా సేవా సంస్థలు వినియోగదారు నుంచి పన్ను వసూలు చేయరాదు. ప్రభుత్వం వివిధ వ్యాపార ప్రకటనల ద్వారా ఈ విషయాన్ని వినియోగదారులకు తెలియచేస్తున్నది.

వినియోగదారుడు వస్తువులు ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరను చెల్లించవలసిన అవసరం లేదు, అంటే లీగల్ మెట్రాలజీ చట్టం కింద అన్ని పనులు ఎంఆర్పీలో కలిసి ఉంటాయి.

వినియోగదారులే జాగ్రత్తపడాలి:

వ్యాపారుల నుంచి జీఎస్టీ విషయంలో ఎవరి చేతిలో మోస పోకూడదని అనుకుంటే ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరం. మోసాలు జరుగకుండా నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అయినా కూడా మనల్ని మనమే కాపాడుకునేలా సొంత ఆసక్తి కనపర్చాలి. ఎలాంటి వ్యాపార /సేవ సంస్థలు ఉండి వస్తువులు/ సేవలు కొనుగోలు వినియోగం తీసుకున్నప్పుడు వినియోగదారుడే జాగ్రత్త పడాలి అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. వినియోగదారుడు తనను తాను రక్షించుకోవడానికి పలు పద్ధతులు ఉన్నాయి ఫిర్యాదు చేయాలంటే మొదట నమోదిత వ్యక్తి వివరాలను జీఎస్టీ అధికారిక వెబ్ సైట్ www.gst.gov.inలో 'సెర్చ్ టాక్స్ పేయర్' ఐకాన్‌లోకి వెళ్లి వ్యాపారి జీఎస్టీ వివరాలను పొందుపరచడం ద్వారా వివరాలను రాబట్టుకోవచ్చును. వెబ్ సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా వివరాలను రాబట్టుకోవచ్చు.

నమోదిత వ్యక్తి సంవిధాన పథకం కింద ఉన్నారా లేదా అనే విషయాన్ని తెలుసుకోవచ్చు.

GSTIN సరైనదా కాదా నిర్ధారణ చేసుకోవచ్చు.



> ఏ వస్తు సేవలపై ఎంత మొత్తం జీఎస్టీ విధించి వసూలు చేస్తున్నారన్న అంశంపై వినియోగదారులు స్పష్టమైన అవగాహన లేదు మోసం చేస్తున్నారన్న అంశంపై సామాన్య మానవులు స్పష్ట మైన అవగాహన నేటికి ఎండమావిని తలపిస్తుంది. జీఎస్టీ రాకముందు తరువాత ధర వివరాల్ని సరిపో ల్చుకుని ఎవరికెంత ఉపశమనం కలిగిస్తుంది నిర్ధారిం చుకుని వీలు కల్పిస్తూ అన్ని రకాల వస్తువులపై వివ రాలు స్పష్టంగా ముద్రించవలెను. దేశ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వా లు అర్థవంతమైన సమన్వయంతో అవగాహన పలి కిన జీఎస్టీ ప్రయోజకత్వానికి అక్రమార్కులు, తూట్లు పొడిచే వారిని పొడవకుండా కాసుకుంటేనే వినియో గదారుడు రారాజుగా నిలబడతాడు.

జీఎస్టీ రిటర్న్‌లను దాఖలు చేస్తున్నారా లేదా గమనించవచ్చు.

జీఎస్టీ పన్ను రేటుతో పాటు పన్ను మొత్తాన్ని ఎలా నిర్ధారించాలని విషయాన్ని తెలుసుకోవచ్చు.

జీఎస్టీ కింద ప్రతి వస్తువు సేవ ప్రభుత్వం నిర్ణయించిన 4 పన్ను స్లాబ్స్ 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతాలలో ఏదో ఒక స్లాబ్‌లో కానీ లేదా అసలు పన్ను పరిధిలోకి రాని జీరో ట్యాక్సు కానీ ఉంటుంది. జీఎస్టీ కింద ఉన్న ల్యాబ్లలో 18% పన్ను పరిధిలోకి చాలా వస్తు సేవలు ఉన్నాయి కాబట్టి ఈ పన్ను పరిధిలోకి వచ్చే వస్తు సేవలు పన్ను భారాన్ని తగ్గించినప్పుడు వినియోగదారులకు అనుకూలంగా ఉంటుంది. కొత్త జీఎస్టీ విధానంలో విద్య, ఆరోగ్య రక్షణతోపాటు వ్యవసాయం ఆహార ఉత్పత్తుల పైన ఆహార ధాన్యాలు, పప్పులు, పండ్లు, కూరగాయలు వంటి వాటిని మినహాయించారు. కానీ జీఎస్టీ ప్రభావం మినహాయింపు గల వస్తు/ సేవలపై కూడా పరోక్షంగా చూపిస్తున్నది. కాబట్టి వీటిపై పన్నుభారం విధించకుండా ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలి, మరొక విధంగా చూస్తే ఇన్ పుట్ టాక్స్ క్రెడిట్ కారణంగా వాస్తవంగా చెల్లించే పన్ను రేటు కూడా మారవచ్చు. ఈ ప్రక్రియలో మొత్తం పన్ను భారం తగ్గుతుంది. అలాగే ఉత్పత్తిదారులు అమ్మకందారుల ఖర్చు కూడా తగ్గుతుంది. దీంతో వినియోగదారులు చెల్లించి ధర కూడా తగ్గుతుంది అలాగే వ్యాపార సంస్థలకు తగ్గిన ఖర్చులు భారం వల్ల వినియోగదారులకు కలిగే ప్రయోజనాలను వారికి బదలాయించేందుకు జీఎస్టీ బిల్లులో యాంటీ ప్రాఫిట్ రింగ్, నిబంధనలను ప్రభుత్వం పొందుపరచింది.

వినియోగదారునికి అండగా నిలిచే ఆయుధం:

ఏ వ్యాపార/సేవా సంస్థలు వినియోగదారులకు తప్పుడు గుర్తింపు సంఖ్యతో వినియోగదారు నుంచి పన్ను వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించకుండా మోసం చేస్తున్నాయి. పన్ను ప్రభుత్వానికి చేరకుండా ఆర్జిస్తున్న మోసగాళ్ల ఆటలు ఇంకా ఎన్ని రోజులు సాగవు. ఇలాంటి మోసాలకు అడ్డుకట్ట వేసి వినియోగదారుల చేతికి అందించడం కోసం ప్రభుత్వం సాంకేతికత ఆధారంగా మోసం చేయకుండా విరుగుడుగా కూడా ఉపయోగపడుతున్న సాధనమే సాంకేతికత. ఈ సాంకేతికతతో ఈ వ్యాపార సేవా సంస్థకు చెందిన జీఎస్టీ గుర్తింపు సంఖ్యను సరైనదా కాదా అనే విషయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకొనే వీలుంది. అంతే కాదు ఇటీవల సమర్పించిన పన్ను రిటర్న్ వివరాలు కూడా తెలుసుకోవచ్చు. ఇందుకు www.gst.gov.in వెబ్ సైట్లోని సేవల విభాగంలోకి వెళ్లి తెలుసుకోవచ్చును. ప్రస్తుతం మన చేతిలో సాంకేతికతతో కూడిన స్మార్ట్ ఫోన్లు అందుబాటులో ఉన్నాయి. వాటి ఆధారంగా మనకు లభ్యమవుతుంది.

దేశంలో ఏ చట్టాన్ని నిర్వహించేందుకైనా సమాచార సాంకేతికత అత్యంత శక్తివంతమైన ఆయుధం. ఈ విధంగా నియమ నిబంధనలు పాటించే విషయంలో వ్యాపారుల, మోసాల నుంచి తమను తాము కాపాడుకునే విషయంలో వినియోగదారులకు అండగా నిలిచే ఆయుధం కూడా ఇదే. అలాగే జీఎస్టీ సంబంధిత వివరాలు తెలుసుకునేందుకు గూగుల్ ప్లేస్టోర్ లేదా యాపిల్ ప్లే స్టోర్‌లో ఉన్నాయి. ఈ యాప్‌లు వినియోగదారులకు చాలా ఉపయోగపడతాయి. అంతేకాక మన తెలుగు వ్యక్తి అభివృద్ధి చేసిన 'eztax.in'అటు యాప్‌గాను అకౌంటింగ్ ప్యాకేజెస్‌గాను ఉపయోగపడుతుంది. ఈ యాప్ ప్యాకేజీలు ఉపయోగించాలంటే వినియోగదారులు వీటిపై కనీస పరిజ్ఞానం ఉండాలి. అలాగే జీఎస్టీ నమోదిత వ్యాపారిపై www.consumerhelpline.gov.inలో ఫిర్యాదు చేయవచ్చు. లేదా 14404 లేదా 1800114000కు కాల్ చేసి లేదా 8130009809కు ఎస్ఎంఎస్ చేయవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సహాయం లైను 18004250082కు కాల్ చేయవచ్చు. ఇందులో వినియోగదారుడు మొదట నమోదు అయ్యాక, ఫిర్యాదు చేయవలసి ఉంటుంది, తదుపరి తన ఫిర్యాదుపై చర్యలను ఏరోజుకారోజు తెలుసుకోవచ్చును.

సరళ విధానాలతో చికిత్స:

ప్రజల యొక్క నిత్యవసరనమైన వస్తువులు సేవలు, కూరగాయలు, పాలు, పండ్లు, తిండిగింజలు వంటి ఎన్నో ఇతర నిత్యావసర వస్తు ధరలు, సేవల వినియోగధరల్లో తగ్గుతాయని, మరెన్నో వస్తు ఉత్పాదన రేట్లు అందుబాటులోకి వస్తాయని అవినీతి తగ్గుముఖం పడుతుందన్న ఆశలు నిరాశలు అయినాయి. జీఎస్టీ తరహా భారీ పన్నుల సంస్కరణల అమలులో కొన్ని సవాళ్లు తప్పవన్నది నిజం. మొదటిలో వ్యక్తమైన భయాందోళనలు నేడు చాలా వరకు ఉపశమించిన చిన్న వ్యాపారులు, వినియోగదారులలో అసంతృప్తి ఛాయలు తొలగడం లేదు. జీఎస్టీ ప్రభావంతో కుదేలయిన సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలను ఆదుకుని తగిన చర్యలపై సూచనలు సలహాలు ప్రభుత్వం అందించాలి. అంతకన్నా ముఖ్యాంశం పన్నుల సరళీకరణ తాలూకు నికర ప్రయోజనాన్ని ప్రజానీకానికి బదలాయించడం అదృశ్య ప్రతి బంధకాల్ని ఛేధించడం. ఏ వస్తు సేవలపై ఎంత మొత్తం జీఎస్టీ విధించి వసూలు చేస్తున్నారన్న అంశంపై వినియోగదారులు స్పష్టమైన అవగాహన లేదు మోసం చేస్తున్నారన్న అంశంపై సామాన్య మానవులు స్పష్టమైన అవగాహన నేటికి ఎండమావిని తలపిస్తుంది. జీఎస్టీ రాకముందు తరువాత ధర వివరాల్ని సరిపోల్చుకుని ఎవరికెంత ఉపశమనం కలిగిస్తుంది నిర్ధారించుకుని వీలు కల్పిస్తూ అన్ని రకాల వస్తువులపై వివరాలు స్పష్టంగా ముద్రించవలెను. దేశ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్థవంతమైన సమన్వయంతో అవగాహన పలికిన జీఎస్టీ ప్రయోజకత్వానికి అక్రమార్కులు, తూట్లు పొడిచే వారిని పొడవకుండా కాసుకుంటేనే వినియోగదారుడు రారాజుగా నిలబడతాడు.

◆ డాక్టర్ పుల్లయ్య దూదేకుల
అసిస్టెంట్ ప్రొఫెసర్
వాణిజ్య శాస్త్ర విభాగం

లక్ష్యం చేజార్చుకుంటున్న యువతరం

మనిషి దశలలో చాలా ప్రముఖమైనది యుక్తవయస్సు. యుక్తవయసులో కలిగే అనుభవాలు మనిషి జీవితాంతం వెన్నంటే ఉంటాయి. ఉన్నత స్థితికి ఎదగాలంటే యుక్తవయసులో తీసుకునే నిర్ణయాలు ప్రధానమైనవి. మధుర స్మృతులు కావచ్చు లేదా మచ్చగా మిగిలే గాయాలు కావచ్చు. బంగారం లాంటి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యువత ఒక్కొక్క అడుగు వేయాలి. యుక్తవయసులోనే శారీరక, మానసిక పరిపక్వత అభివృద్ధి చెందుతాయి. ఈ వయస్సులో కొత్త అంశాలను కనుగొనడానికి, శోధించడానికి ప్రయత్నాలు చేయడంలో అత్యుత్సాహన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. ఇటీవల యువత కొత్త పుంతలు తొక్కుతోంది. స్మార్ట్ ఫోన్ వినియోగంతో మంచి కంటే ఎక్కువ చెడుకే సులభంగా, తొందరగా ప్రభావితమవుతున్నారు. ప్రస్తుతం సరదాగా యువత చేసుకుంటున్న స్మోకింగ్ (ధూమపానం) అలవాటే జీవితాంతం కొనసాగే చెడు అలవాటుగా మారుతోంది. ఇది కాస్తా వ్యసనంగా మారి క్రమంగా ప్రాణాల మీదికి తెస్తుంది. ధూమపానం చేసేవారి యువత సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. సిగరెట్లు కాల్చేందుకు డబ్బులు ఖర్చు పెట్టిన దానికంటే.. ధూమపానంతో వచ్చే వ్యాధులను తగ్గించుకునేందుకు వందల రేట్ల రూపాయలు అధికంగా ఖర్చు పెట్టినా గాని, పొగాకు పదార్థాల ప్యాకెట్లపై తేలు బొమ్మ, కాన్సర్ రోగి బొమ్మను ముద్రించినా, సిగరెట్ ధర ఎంత పెంచినా, బహిరంగ ప్రదేశాలలో ధూమపానం నిషేదించినా, చెల్లించక తప్పదు భారీ మూల్యం, ధూమపానం ప్రాణాంతకం అని తెలిసినా సిగరెట్ అమ్మకాలు, పొగాకు ప్రియుల సంఖ్య మాత్రం రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయే గాని తగ్గడం లేదు.


సెకండ్ హ్యాండ్ స్మోకింగ్ ప్రస్తుతం యువతలో విపరీతంగా పెరిగిపోతోంది. తమ ఆరోగ్యాన్ని తమే పాడు చేసుకుంటున్నామన్న సోయి మరిచి పోయి, పొగను రింగులు రింగులుగా వదులుతూ, విలాసంగా సిగరెట్ కాలుస్తున్నానన్న భ్రమలో తేలియాడుతూ యువత తమ జీవితాన్ని చేజేతులా బూడిదచేసుకుంటున్నారు.

ధూమపానం వల్ల వ్యక్తులలో నోటి కాన్సర్, దంతవ్యాదులు, ఉపిరి తిత్తుల క్యా న్సర్, ఉదరకోశ వ్యాధులు, అల్సర్, గ్యాస్ ట్రబుల్, ఉదర కోశ క్యాన్సర్ సోకే అవకాశాలు ఎక్కువ. సెకండ్ హ్యాండ్ స్మోకింగ్ కారణంగా పిల్లల్లో ఆస్తమా రోగుల సంఖ్య నానా టికీ పెరిగిపోతుంది. గుండెకు సంబంధించిన రక్త నాళాలు దెబ్బతిని రక్తపోటు, గుండెపోటు సంభవిస్తాయి. మెదడులోని రక్తనాళాలు చిట్లి పక్షవాతం, నరాల బలహీనత ఏర్పడే ప్రమాదం ఉంది. పిల్లల్లో వినికిడి, మాట్లాడే సమస్యలు తలెత్తుతాయి.

తాగే వాడికన్నా గుప్పు గుప్పు మంటూ వదిలే పొగ పీల్చిన వ్యక్తులకు సైతం ఆయుక్షీణం కలుగుతోంది. పొగ తాగడం మానే య్యాలనే ఆలోచన వచ్చినా అమలులో మాత్రం సాధ్యం కావడం లేదనే వారు ఎక్కువయ్యారు. ఒక చెడు మొక్కను నిర్మూలించాలని ఆకులు, కొమ్మలు, కాండంలను నరికి వేసినంత మాత్రాన చెడు మొక్క పూర్తిగా నశించదు. మరలా కొద్ది రోజులకు మళ్లీ మొలకెత్తుతుందనే విషయం మనకం దరికీ తెలుసు. ఆ చెడు మొక్కను వేర్లతో సహా, నామా రూ పాలు లేకుండా పెకిలి వేసినపుడు మాత్రమే సాధ్యమవు తుంది. పొగతాగడం మానేయాలనుకోవడం మంచి నిర్ణయ మే. పొగతాగడం మానేయాలనే ఆలోచనను ఆచరణలో పెట్టాలంటే మాత్రం తప్పకుండా ప్రణాళిక రూపొం దించుకోవాలి. పొగ తాగే వ్యసన పరులందరికీ ఒకే రకమైన నియమాలు పనిచేయవనే విషయాన్ని ముందుగా గు ర్తించడం మంచిది. పొగతాగడాన్ని ఎందుకు మానేయాలనుకుంటున్నారో మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోవాలి. మీ బలాలు, బలహీనతలను తెలుసుకోండి. సిగరెట్ తాగడానికి మిమ్మల్ని ఏ పరిస్థితులు ప్రేరేపిస్తున్నాయో గమనించండి. సిగరేట్లు మానేయడం సులువే. పొగతాగడం మానివేసే సమయంలో ఉత్పన్నమయ్యే అసహనం, ఆందోళన వంటి లక్షణాలు అగుపిస్తాయి. వీటిని ధృఢసంకల్పంతో, ధీమాగా ఎదుర్కొవాలి.

ధూమపానానికి దూరంగా ఉండటానికి...:

డ్యూక్ యూనివర్సిటీ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, ధూమపానం చేసే ముందు ఒక గ్లాసు పాలు తాగడం మూలంగా సిగరెట్ రుచి పట్ల ఆసక్తి ఉండదని తెలియచేసింది. సిగరెట్ ఆలోచన మనసుకు రాగానే, ముందుగా ఒక గ్లాసు పాలు త్రాగితే మంచి ఫలితం ఉంటుంది.



ధూమపానం చేసేవారు ప్రతిరోజూ క్రమం తప్పకుండా గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ తాగితే వారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని ఒక అధ్యయనంలో వెల్లడైంది. నేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ప్రకారం రోజులో కనీసం 35 మిల్లీ గ్రాముల విటమిన్–సి తీసుకోవాలి. అయితే పొగాకు తినేవారిలో వచ్చే విటమిన్–సి లోపం కార ణంగా గుండె జబ్బులు, కేన్సర్ బారిన పడే ప్రమాదాన్ని పెంచుతుంది. విటమిన్ సి అధికంగా ఉండే ఆహారపదార్థలు తీసుకుంటే పొగాకు వ్యసనం నుంచి బయటపడవచ్చు. విటమిన్ ఇ ఎక్కువగా తీసుకుంటే ధూమపానం వలన వచ్చే అనారోగ్య సమస్యలను నివారించవచ్చు.

తల్లిదండ్రులకు సిగరెట్ కాల్చడం ఒక అలవాటుగా ఉన్నట్లయితే యుక్తవయస్సులోని పిల్లలు పరిశీలిస్తూ, వారు కూడా అలవాటుగా చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులుగా బాధ్యతగా తీసుకొని పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టి యందుంచుకుని సాధ్యమైనంత త్వరగా పొగ తాగడం అలవాటును మానుకోవాలి. ధూమపానం నిర్మూలన దిశగా వ్యతిరేకంగా కఠినమైన నిబంధనలను, నియమాలను నిర్దేశిస్తూ, చిన్న వయస్సులోనే ధూమపానానికి అలవాటు పడటం మంచిది కాదని పిల్లలను హెచ్చరిస్తూ ఉండాలి. ధూమపానం ఎంతమాత్రమూ మంచి అలవాటు కాదని ధృడంగా, ఖచ్చితంగా చెప్పాలి.

యుక్తవయస్సులోని పిల్లలకు ఎక్కువ సమయాన్ని కెటాయిస్తూ వారితో మాట్లాడుతూ వారి మనస్తత్వాన్ని అర్థం చేసుకోవాలి. యుక్త వయసు పిల్లలో కొత్త అంశాల వైపుగా మొగ్గుచూపుతూ వాటి ఆకర్షణకు లోనవుతూ ఉంటారు. స్నేహ బృందంతో కలిసి పోవడానికి, వారి దగ్గర మెప్పు పొందడానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. సరైన సమ యంలో జోక్యం చేసుకుని, వారికి సరైన మార్గదర్శం చేయడం ద్వారా ధూమపానంకు దూరంగా ఉండేందుకు ప్రోత్సహిస్తూ ఉండాలి. ధూమపానం చేయడం వలన కలిగే దుష్ప్రయోజనాలను, జీవితకాల వ్యసనంగా ఎలా మారుతుందో తెలియజేయాలి. సిగరెట్లో ఉండే హానికారక రసాయనాలు గురించి, శ్వాసక్రియా వ్యాధులు, ఊపిరితిత్తుల కేన్సర్, గుండె సమస్యలు మొదలైన పలు ఆరోగ్య సమస్యలు ఏ విధంగా సంభవిస్తాయో వారికి తెలియజేయాలి.

ధూమపానం మానేయడం మూలంగా స్నేహితులు దూరమవుతారని, వారి అభిమానం కోసం తన స్నేహితులు చెప్పిన వాటికి లేదు అని చెప్పడానికి మీ యుక్తవ యస్సులోని పిల్లలు భయపడవచ్చు. యుక్తవయస్సులోని పిల్లలతో మాట్లాడి, వారు సరైన నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడాలి. కొన్ని దురలవాట్లకు లేదు అని చెప్పడం వలన జీవితాంతం సుఖంగా జీవించవచ్చని వారికి చెప్పాలి. తల్లిదండ్రులు ఒక స్నేహితుడిగా భరోసాను పిల్లలలో నింపుతూ ఉండాలి. తల్లిదండ్రులు యుక్తవయస్సులోని పిల్లలు బాధ్యతాయుతమైన వయోజనులగా ఎదగడానికి కీలక పాత్ర ను పోషించాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు సరైన సమయంలో జోక్యం చేసుకుని, సరైన మార్గదర్శకం అందించి, పిల్లలకు బాసటగా నిలిచినప్పుడు సరైన మార్గంలో పయనిస్తారు. ఉన్నత స్థాయికి ఎదగగలుగుతారు.

యువత ధూమపానం అలవాటును దూరం చేసుకోవడానికి సైకాలజిస్ట్ ద్వారా కౌన్సెలింగ్ తీసుకోవడం మంచిది. లక్ష్యం వైపుగా పయనించడానికి కౌన్సెలింగ్ ద్వారా సాధించడం సులువవుతుంది.

◆ డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ ఫ్యామిలీ కౌన్సెలర్
9703935321



సీఐసీగా సుధీర్ భార్గవ ప్రమాణం

న్యూఢిల్లీ, జనవరి 1: కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ (సీఐసీ)గా సుధీర్ భార్గవ మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్.. సుధీర్ భార్గవతో ప్రమాణం చేయించారు. దీనికి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు రాజ్ నాథ్ సింగ్, అరుణ్ జైట్లీ హాజరయ్యారు. సుధీర్ భార్గవతో పాటు మరో నలుగురిని సమాచార కమిషనర్లుగా నియమిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. మాజీ ఐఎఫ్ఎస్ అధికారి యశ్వర్ధన్ కుమార్ సిన్హా, మాజీ ఐఆర్ఎస్ అధికారి వనజ ఎన్ సర్నా, మాజీ ఐఏఎస్ అధికారి ఎన్‌కే గుప్తా, మాజీ లా సెక్రటరీ సురేశ్‌చంద్రలను సమాచార కమిషనర్లుగా నియమించారు.

నా కులమే నాకు అతి ముఖ్యం..

- వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన రాజస్థాన్ మంత్రి



జైపూర్, జనవరి 1: ''నా కులమే నాకు అతి ముఖ్యం, ఆతరువాతే మన సామాజిక వర్గం వారికి, ఆతరువాతి స్థానం సమాజంలోని అందరికీ, అందరి కోసం పనిచేస్తాం'' ఈ మాటలు అన్నది ఏ బాధ్యతో తెలియని వ్యక్తి ఏమాత్రం కాదు. సాక్షాత్తూ ఓ రాష్ట్ర మంత్రి బహిరంగంగా చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజస్థాన్ సర్కారును చిక్కుల్లోకి తోసింది. అశోక్ గెహ్లాట్ మంత్రి వర్గంలోని ఏకైక మహిళా మంత్రి, ఎంబీఏ చదివిన.. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖామంత్రి మమతా భూపేష్ చేసిన పై వ్యాఖ్యలు అందరికీ షాక్ ఇస్తున్నాయి. బైరవ అనే షెడ్యూల్ తెగకు చెందిన మమతా 26 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఎన్ఎస్‌యూఐ సెక్రెటరీగా 1992లో ఉన్న ఈమె పార్టీలో పలు పదవులు నిర్వహించిన అనుభవం ఉండి కూడా బీజేపీ నేతల్లా వివాదాస్పద వ్యాఖ్యలు ఎందుకు చేసినట్టని సొంత పార్టీ నేతలే చర్చిస్తున్నారు.




సచివాలయానికి పరికర్

- వైద్యనిపుణులు.. సహాయకులతో రాక
- కొత్త ఏడాది గోవా వాసులకు ఆశ్చర్యం
- గోవా బీజేపీ శ్రేణులలో కొత్త ఉత్సాహం
- సీఎంను స్వాగతించిన స్పీకర్.. కార్యకర్తలు

పణజి, జనవరి 1: కొత్త సంవత్సరం తొలి రోజున గోవా వాసులు ఆశ్చర్యానికి గురయ్యారు. క్లోమ కేన్సర్‌తో బాధపడుతున్న ముఖ్యమంత్రి మనోహర్ పరికర్ చాలా కాలం తర్వాత తొలిసారిగా రాష్ట్ర సచివాలయానికి వెళ్లారు. అక్కడ ఆయనను పార్టీ శాసన సభ్యులు, పలువురు బీజేపీ కార్యకర్తలు సాదరంగా ఆహ్వానించారు. కొంతమంది వైద్య నిపుణులు, సిబ్బంది వెంట రాగా.. ఆయన నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఉదయం 10.30 గంటలకు సచివాలయంలోకి ప్రవేశించారు. గత కొన్ని నెలల్లో పరికర్ ఇలా జనంలోకి రావడం ఇది రెండోసారి. ఇంతకుముందు ఆయన గత నెలలో పణజిలో నిర్మాణంలో ఉన్న ఒక వంతెన పనుల పరిశీలనకు వచ్చారు. కానీ గత సంవత్సరం అక్టోబరులో ఢిల్లీలోని ఎయిమ్స్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన సచివాలయానికి రావడం మాత్రం ఇదే మొదటిసారి. తన ట్రేడ్ మార్క్ హాఫ్ హ్యాండ్స్ షర్టు ధరించి.. ముక్కులోంచి ఉదరంలోకి వెళ్లే ట్యూబు కూడా యథాతథంగా పెట్టుకుని పరికర్ సచివాలయానికి వచ్చారు. మెట్లు ఎక్కడానికి ఆయన సహాయకులు సాయం చేశారు. స్పీకర్ ప్రమోద్ సావంత్, మరికొందరు బీజేపీ నాయకులు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంత్ షెట్ తనావ్డే కూడా అక్కడ ఉన్నారు. ముఖ్యమంత్రి సచివాలయానికి రావడంతో గోవా బీజేపీ కార్యకర్తలతో పాటు గోవా ప్రజలకు కూడా ఎంతో ఆనందం కలిగిందని తనావ్డే అన్నారు. ఇది చాలా మంచి పరిణామమని, అందరూ సంతోషించారని తెలిపారు. క్లోమకేన్సర్‌తో బాధపడుతున్న మనోహర్ పరికర్ 2018 ఫిబ్రవరి నుంచి గోవా, ముంబై, న్యూయార్క్, ఢిల్లీ ఆసుపత్రులలో పలు విడతలుగా చికిత్స పొందారు. గత కొన్ని నెలలుగా ఆయన రాజీనామా చేయాలని గోవా ప్రతిపక్షం డిమాండుచేస్తోంది. సుదీర్ఘకాలంపాటు అనారోగ్యం కారణంగా ఆయన అందుబాటులో లేకపోవడంతో పాలన స్తంభించిందని కాంగ్రెస్ మండిపడుతోంది. ఇలాంటి తరుణంలో పరికర్ సచివాలయానికి రావడం బీజేపీ నేతలు, కేడర్‌కు మంచి ఉత్సాహం కలిగించింది.

కమేడియన్ ఖాదర్‌ఖాన్ కన్నుమూత





ముంబై, జనవరి 1: అలనాటి పాతతరం నటుడు ఖాదర్ ఖాన్ (81) కన్నుమూశారు. గత కొంతకాలం తీవ్ర అస్వస్థతో బాధపడుతున్న ఆయన మంచానికే పరిమితమయ్యారు. తన తండ్రి ప్రాణాలతో ఉండగానే మరణించాడంటూ ప్రచారం చేస్తున్నరంటూ ఖాదర్ ఖాన్ కుమారుడు సర్ఫరాజ్ ప్రకటించిన మరుసటి రోజు ఉదయమే కాదర్ ఖాన్ మరణించారు. గత కొంతకాలంగా ఆయన కెనడాలోని తన కుమారిడి వద్దే ఉంటున్నారు. మరణించడానికి కొన్ని గంటల ముందే ఆయన కోమాలోకి వెళ్లినట్టు, గత 17 వారాలుగా ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు కుమారుడు తెలిపారు. కుటుంబ సభ్యులంతా ఇక్కడే ఉన్నందున ఆయన అంత్యక్రియలు కెనడాలోనే జరుపనున్నట్టు వెల్లడించారు. 1937లో కాబుల్‌లో జన్మించిన ఆయన, 1973లో యష్ చోప్రా చిత్రం 'దాగ్'తో తెరంగేట్రం చేసాక 300కు పైగా చిత్రాల్లో నటించారు. కమెడియన్, విలన్‌తో పాటు సపోర్టింగ్ యాక్టర్ పాత్రలు చేసి మెప్పించిన ఆయన.. తెరవెనుక కూడా డైలాగులు, కథలు రాస్తూ 250కు పైగా చిత్రాల్లో తన కలం సత్తాను చాటారు. అమర్ అక్బర్ ఆంటోనీ, కూలి, ధరం వీర్, షరాబీ, లావారిస్, ముకద్దర్ కా సికందర్ వంటి ఎన్నో చిత్రాలకు ఆయన మాటలు అందించారు.

ప్రముఖుల సంతాపం

ఖాదర్ ఖాన్ మరణంపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, దిగ్గజ నటుడు అమితాబ్ బచ్చన్, ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు అనుపమ్ ఖేర్ సంతాపం వ్యక్తం చేస్తూ ట్వీట్లు చేశారు. బాలీవుడ్‌లో అడుగు పెట్టకముందు ముంబైలోని సివిల్ ఇంజినీరింగ్ కాలేజీలో పాఠాలు చెప్పిన ఆయన్ను ఓ కాలేజీ నాటకంలో చూసిన దిగ్గజ నటుడు దిలీప్ కుమార్ వెండితెరకు పరిచయం చేశారు. అంతకు ముందు పలు నాటకాలకు ఆయన కథలు అందించేవారు. 90ల్లో వచ్చిన పలు చిత్రాల్లో ఖాదర్ ఖాన్ కీలక కమెడియన్ పాత్రలు పోషించి అశేష అభిమాన గణాన్ని సంపాదించుకున్నారు. అమితాబ్ బచ్చన్, జితేంద్ర, గోవిందా వంటి నటులతో కలసి పెద్ద సంఖ్యలో చిత్రాల్లో నటించిన ఆయన కామెడీ టైమింగ్‌కు పెట్టింది పేరుగా బాలీవుడ్‌ను ఏలారు. బిగ్ బీ కోసం 22 చిత్రాల్లో ఆయన డైలాగులు రాశారు. దక్షిణాది రీమేక్‌లు అయిన హిమ్మత్‌వాలా, జస్టిస్ చౌదరి వంటి చిత్రాలకు కూడా ఆయనే హిందీలో డైలాగులు అందించారు. నంబర్ వన్ సిరీస్‌లో వచ్చిన హీరో నంబర్ 1, ఆంటీ నంబర్ 1, కూలీ నంబర్ 1, అనారీ నంబర్ 1 వంటి అన్ని చిత్రాలన్నింటిలోనూ ఈయన నటించడం విశేషం. రెండు సార్లు ఫిలింఫేర్ అవార్డు గెలుచుకున్న ఈయన, 'మేరీ ఆవాజ్ సునో, అంగార్'కు బెస్ట్ డైలాగ్ రైటర్ అవార్డులు గెలుపొందారు. 'బాప్ నంబరి బేటా దస్ నంబరి' చిత్రానికి గానూ బెస్ట్ కమెడియన్ అవార్డు సొంతం చేసుకున్నారు. చివరగా 2017లో వచ్చిన 'మస్తి నహి సస్తి' అనే చిత్రంలో ఆయన నటించారు. దశాబ్దాలుగా బాలీవుడ్‌లో రాణించినప్పటికీ ఆయనకు ఒక్క పద్మ అవార్డు కూడా రాకపోవడం గమనార్హం.

న్యాయ ప్రక్రియ పూర్తయ్యాకే!

- ఆ తర్వాతే రామమందిరంపై ఆర్డినెన్స్
- అయోధ్యపై అడ్డంకులు సృష్టిస్తున్న కాంగ్రెస్
- దేశ శాంతి కోసం వాటిని నిలిపివేయాలి
- ఆ పార్టీని, వారి లాయర్లను వేడుకుంటున్నా
- అయోధ్యను రాజకీయ దృక్కోణంలో చూడొద్దు
- పెద్ద నోట్ల రద్దు ఆకస్మిక జట్కా కాదు
- ఏడాది ముందే దీనిపై హెచ్చరించాను
- నోట్ల రద్దుతో బ్యాంకింగ్‌లోకి నల్లధనం
- ఆంగ్ల చానల్ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, జనవరి 1: అయోధ్యలో రామమందిరం నిర్మాణంపై న్యాయ ప్రక్రియ పూర్తయిన తర్వాతే కార్యనిర్వాహక ఆదేశాలు (ఆర్డినెన్స్) జారీపై ఎలాంటి నిర్ణయమైన తీసుకుంటామని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టం చేశారు. అయోధ్య భూవివాదం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున ఎలాంటి ఆర్డినెన్స్ జారీ చేయబోమన్నారు. వారంలో ఈ కేసు సుప్రీం కోర్టు ముందుకు రానున్న నేపథ్యంలో ప్రధాని మోదీ ఇలా స్పందించడం గమనార్హం. కొత్త ఏడాది తొలి రోజు మంగళవారం ఓ ఆంగ్ల చానల్‌కు ప్రధాని మోదీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివిధ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. న్యాయ ప్రక్రియ గురించి ఆలోచించకుండా రామమందిరం నిర్మాణానికి ఆర్డినెన్స్ లేదా కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ పెరుగుతున్న విషయం తెలిసిందే. న్యాయ ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రభుత్వ ఎలాంటి విధులు నిర్వహించాల్సి ఉంటుందో అలాగే చేస్తామని, అందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తామని మోదీ చెప్పారు. రామమందిరం వివాద పరిష్కారాన్ని రాజ్యాంగ పరిధిలో కనుగొంటామని పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్నామని గుర్తు చేశారు. అయోధ్య న్యాయ ప్రక్రియను ఆలస్యం చేసేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని ఆరోపించారు. ''కోర్టులో కాంగ్రెస్ న్యాయవాదులు అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇది నిలిచిపోవాలి. న్యాయ ప్రక్రియ తన మార్గంలో ముందుకు సాగేలా చూడాలి'' అని మోదీ ఉద్ఘాటించారు. దేశ శాంతి, సఖ్యతను పెంపొందించేందుకు అయోధ్య ప్రక్రియను న్యాయస్థానాల్లో అడ్డుకోవడాన్ని కాంగ్రెస్ లాయర్లు నిలిపివేయాలని వేడుకుంటున్నానన్నారు. అయోధ్య అంశాన్ని కూడా రాజకీయ దృక్కోణంలో చూడొద్దని సూచించారు.


పెద్ద నోట్ల రద్దు జట్కా కాదు: మోదీ

పెద్ద నోట్ల రద్దు ఆకస్మికంగా తీసుకున్న నిర్ణయం కాదని, అది ప్రజలకు తగిలిన షాక్ కాదని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. ''పెద్ద నోట్ల రద్దు ప్రజలపై పెద్ద జట్కా (షాక్) కాదు. నల్లధనం విషయంలో ఏడాది ముందే హెచ్చరించాను. మీరు నల్లధన సంపన్నపరులైతే ఆ సొమ్మును బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలని, పెనాల్టీలు చెల్లించాలని, అలాగైతే అండగా నిలుస్తామని చెప్పాం. కానీ.. నేను చెప్పినట్లు చేస్తానని భావించి కొందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు'' అని మోదీ అన్నారు. మూలుగుతున్న నల్లధనాన్ని మెయిన్‌స్ట్రీమ్‌లోకి తెచ్చేందుకే పెద్ద నోట్ల రద్దు చేశామన్నారు. పెద్ద నోట్ల రద్దుకు ముందు సమాంతర ఆర్థిక వ్యవస్థ ఉండేదని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు సమాంతరంగా ప్రవహించేదని చెప్పారు. నోట్ల రద్దుతో సొరుగుల్లో ఉన్న పెద్ద నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చి చేరాయన్నారు.

సమయం ఎప్పుడో చెప్పండి



- రఫేల్ డీల్‌పై చర్చకు మేం సిద్ధం
- అరుణ్ జైట్లీ సవాలుకు కాంగ్రెస్ సై
- పార్లమెంటులో చర్చకు రెడీ: ఖర్గే



న్యూఢిల్లీ, జనవరి 1: రఫేల్ ఫైటర్ జెట్ విమానా కొనుగోలు ఒప్పందంపై పార్లమెంటులో చర్చకు రావాలని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ చేసిన సవాలుకు కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా స్పందించింది. చర్చ నుంచి కాంగ్రెస్ పారిపోతోందని జైట్లీ చేసిన వ్యాఖ్యలకు పార్టీ సీనియర్ నాయకుడు మల్లికార్జున ఖర్గే సమాధానమిచ్చారు. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు కూడా అయిన ఖర్గే.. బుధవారం నాడు ఈ అంశంపై పార్లమెంటులో చర్చకు సమయం కేటాయించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కోరారు. జైట్లీ తమను సవాలు చేశారని, దాన్ని తాము స్వీకరిస్తున్నామని.. 2వ తేదీన చర్చకు తాము సిద్ధమని, అందువల్ల సమయం నిర్ణయించాలని ఖర్గే లోక్‌సభలో తెలిపారు. ఈ ఒప్పందంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు చేయించాలని కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతుండగా, ప్రభుత్వం మాత్రం దానిపై చర్చిద్దామని అంటోంది. డిసెంబరు 11న పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి కాంగ్రెస్ జేపీసీ కోసం పట్టుబడుతోంది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ డిఫెన్స్‌కు ఆఫ్‌సెట్ కాంట్రాక్టు ఇప్పించడానికి ప్రభుత్వం అధిక ధర చెల్లించిందన్న ఆరోపణలను సుప్రీంకోర్టు తోసిపుచ్చడంతో.. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ ఈ ఒప్పందంపై దర్యాప్తు కోరుతోంది. ప్రభుత్వం కోర్టును కూడా తప్పుదోవ పట్టించిందని ఆరోపించింది. రఫేల్ జెట్ విమానాలను డసాల్ట్ నుంచి కొనుగోలు చేయడానికి కుదిరిన ఒప్పందంలో తీవ్రస్థాయి అవినీతి ఉందని కాంగ్రెస్ అంటోంది. ఈ విషయంలో పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బీజేపీ సర్కారుపై ఉధృతంగా పోరాడుతున్నారు. రిలయన్స్ డిఫెన్స్‌కు ఈ రంగంలో ఏమాత్రం అనుభవం లేకపోయినా రూ. 30 వేల కోట్ల కాంట్రాక్టు ఇప్పించారని ఆయన అన్నారు. అంబానీకి మేలు చేయడం కోసం ప్రభుత్వరంగ సంస్థ అయిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌ను పక్కన పెట్టారని ఆరోపించారు. పార్లమెంటులో సోమవారం మరోసారి ఆ పార్టీ సభ్యులు నినాదాలు చేయడంతో.. ''మీకు ధైర్యం ఉంటే దీనిపై వెంటనే చర్చ ప్రారంభించండి'' అని జైట్లీ సవాలు చేయగా, దాన్ని ఖర్గే వెంటనే ఆమోదించారు. తాను వద్దనడం లేదని.. నిజానికి చర్చకు సభ ఎపపుడో సిద్ధంగా ఉందని స్పీకర్ సుమిత్రా మహాజన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం జేపీసీ విచారణ కావాలంటూ పట్టుబడుతోందని.. ఎవరి సవాళ్లు వారివద్దే ఉంచుకోవాలి తప్ప తనను సవాలు చేయకూడదని అన్నారు. చర్చ ఎప్పుడు జరగాలో తాను నిర్ణయిస్తానని స్పష్టం చేశారు. అనంతరం సభను బుధవారానికి వాయిదా వేశారు. అంతకుముందు రఫేల్ జెట్ విమానాలను ఎంత ధరకు కొంటున్నారో ప్రభుత్వం వెల్లడించాలని ఖర్గే డిమాండు చేశారు. ఫ్రాన్సు అధ్యక్షుడు కూడా ధర చెప్పచ్చని అంటున్నా ప్రభుత్వం ఎందుకు వెల్లడించడం లేదని ఆయన అడిగారు. అయితే ఇది రహస్యమని చెప్పి.. ప్రభుత్వం ధరను తెలియజేయలేదు.

లోక్‌సభ బరిలోనూ నేనూ

- ఈ ఏడాది ఎన్నికల్లో పోటీ చేస్తా
- నటుడు ప్రకాశ్ రాజ్ ప్రకటన



బెంగళూరు, జనవరి 1: రజనీకాంత్, కమల్‌హాసన్ తర్వాత దక్షిణాదిలో మరో సినీ ప్రముఖుడు రాజకీయ అరంగేట్రం చేయనున్నారు. ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ నూతన సంవత్సరం రోజున కీలక ప్రకటన చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ''అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. మీ అందరి మద్దతుతో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తున్న. ఎక్కడి నుంచి అనేది త్వరలోనే ప్రకటిస్తా. వచ్చేది ప్రజా ప్రభుత్వమే'' అంటూ ప్రకాశ్‌రాజ్ మంగళవారం ట్వీట్ చేశాడు. అయితే ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే దానిపై ఆయన వివరాలు వెల్లడించలేదు. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు ఎక్కుపెడుతూ ఆయన తరచుగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. రజనీకాంత్, కమల్‌హాసన్ తరువాత రాజకీయ ప్రకటన చేసిన నటుడిగా ప్రకాశ్‌రాజ్ నిలిచారు. ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా సీఎం కేసీఆర్‌తో కలిసి పలు అంశాలపై చర్చించిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల వేళ ప్రకాశ్‌రాజ్ ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది ఏప్రిల్ లేదా మేలో సార్వత్రిక ఎన్నికలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

అవమానించారని.. కాల్చేశాడు!

- కొత్త సంవత్సరం పార్టీలో కాల్పులు
- కుటుంబ సభ్యులను చంపేసిన వ్యక్తి
- అత్తింటివాళ్లపై పట్టలేనంత ఆగ్రహం
- మృతుల్లో సొంత కొడుకు.. కూతురు
- అదే తుపాకితో కాల్చుకున్న సుచీప్
- థాయ్‌లాండ్‌లో కొత్త ఏడాది దారుణం

బ్యాంకాక్, జనవరి 1: కొత్త సంవత్సరం పార్టీలో తనను అత్తింటివారు ఎవరూ పట్టించుకోకుండా అవమానించారన్న కోపంతో.. తన కన్న బిడ్డలతో సహా ఆరుగురిని ఓ వ్యక్తి కాల్చి చంపేశాడు. ఆ తర్వాత అదే తుపాకితో తనను తాను కాల్చేసుకున్నాడు. కొత్త సంవత్సరం వచ్చిన 10 నిమిషాల తర్వాత థాయ్‌లాండ్‌లో ఈ ఘోరం జరిగింది. సుచీప్ సార్న్‌సంగ్ అనే వ్యక్తి తన భార్య కుటుంబ సభ్యులతో కలిసి చుంఫాన్ రాష్ట్రంలో జరిగే కొత్త సంవత్సర వేడుకలలో పాల్గొన్నాడు. బాగా తాగేసి ఉన్న అతడిని ఎవరూ సరిగా పట్టించుకోలేదు. దాంతో కోపం వచ్చిన అతడు టేబుల్ మీద పెట్టిన తన పిస్టల్ తీసుకుని ఎడాపెడా కాల్పులు జరపడం మొదలుపెట్టాడు. మృతులంతా అతడి కుటుంబ సభ్యులేనని, వాళ్లలో తొమ్మిదేళ్ల కొడుకు, ఆరేళ్ల కూతురు కూడా ఉన్నారని లెఫ్టినెంట్ కల్నల్ లార్ప్ కంపాపన్ చెప్పారు. అందరినీ తలమీద లేదా గుండెల సమీపంలో కాల్చాడని.. అల్లుడైన తనను అత్తింటివాళ్లు సరిగా ఆహ్వానించలేదనే అతడికి కోపం వచ్చిందని ఆయన అన్నారు. కాసేపటికి జరిగిన ఘోరం గుర్తించిన అతడు.. అదే తుపాకితో తనను తాను కాల్చేసుకున్నాడు. మృతుల్లో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. అంతా 47 నుంచి 71 ఏళ్ల మధ్య వయసువారు. థాయ్‌లాండ్‌లో చాలా ఎక్కువ మందికి తుపాకులు ఉంటాయి. చిన్న చిన్న వ్యక్తిగత తగాదాలు, ప్రేమ వివాదాలు, వ్యాపార తగాదాలలో కూడా తుపాకులను విచ్చలవిడిగా వాడుతుంటారు.

అమెరికాకు కిమ్ వార్నింగ్

- ఆంక్షలపై విధానం మార్చుకోవాల్సిందే
- లేకపోతే సంబంధాలపై ఆలోచిస్తాం
- కొత్త సంవత్సర ప్రసంగంలో కిమ్



సియోల్, జనవరి 1: కొత్త సంవత్సరం తొలి రోజున ఉత్తరకొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ అమెరికాకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. తమపై విధించిన ఆంక్షల విషయంలో విధానం మార్చుకోకపోతే ఆ దేశంతో సంబంధాల గురించి తాము ఆలోచించాల్సి వస్తుందని హెచ్చరించారు. జూన్ నెలలో సింగపూర్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన ఒప్పందం మేరకు కొరియన్ ద్వీపంలో పూర్తిగా అణ్వాయుధలు లేకుండా చేస్తామని అంగీకరించారు. కానీ, దానికి అర్థం ఏంటని ఇరు దేశాలు వాదించుకోవడం మొదలుపెట్టడంతో అణు నిరాయుధీకరణ ప్రక్రియ ఆగిపోయింది. ప్రపంచం మొత్తం ముందు తమకు చేసిన హామీని అమెరికా నెరవేర్చుకోకపోతే.. తమ దేశం మీద ఆంక్షలు, ఒత్తిళ్లు కొనసాగిస్తే తమ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రయోజనాలను కాపాడుకోడానికి కొత్త మార్గాన్ని ఎంచుకోవడం తప్ప తమకు మరో దారి ఉండకపోవచ్చని కొత్త సంవత్సరం చేసిన ప్రసంగంలో కిమ్ జోంగ్ ఉన్ అన్నారు. ట్రంప్‌ను మరోసారి ఎప్పుడైనా కలవాలనుకుంటున్నానని చెప్పారు. ప్రపంచ దేశాలన్నీ స్వాగతించే ఫలితాన్ని పొందేందుకు ఈ సమావేశం ఉంటుందని చెప్పారు. ప్రధానంగా తమ దేశం మీద విధించిన ఆంక్షల నుంచి తమకు మినహాయింపు కావాలని ఉత్తర కొరియా డిమాండు చేస్తోంది. అణ్వాయుధాలు, బాలిస్టిక్ మిస్సైళ్ల కార్యక్రమాన్ని నిషేధించడాన్ని ఖండించింది. ఈ విషయంలో అమెరికా గ్యాంగ్‌స్టర్‌లా ప్రవర్తిస్తోందని మండిపడింది. ఉత్తరకొరియా పూర్తిస్థాయిలో అణు నిరాయుధీకరణ చేసేవరకు తమ ఆంక్షలు కొనసాగుతాయని అమెరికా అంటోంది. తాజాగా కిమ్ చేసిన ప్రకటనతో ఆయన అసహనం బయటపడిందని, చర్చలలో పురోగతి లేదని తెలుస్తోందని దక్షిణ కొరియా మాజీ మంత్రి కిమ్ హ్యూంగ్-సియోక్ అన్నారు.


గత సంవత్సరం జనవరి 1న చేసిన ప్రసంగంలో అయితే.. అణు వార్‌హెడ్లను భారీ ఎత్తున తయారుచేయాలని కిమ్ పిలుపునిచ్చారు. అదే ఈసారి మాత్రం, తమ ఇక మీదట కొత్తగా అణ్వాయుధాలను ఉత్పత్తి చేయబోమని, పరీక్షించేది లేదని, ఉపయోగించబోమని, విస్తరించేది కూడా లేదని ఇప్పటికే ప్రకటించామని అన్నారు. అందువల్ల అమెరికా కూడా ఇందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక లెదర్ కుర్చీలో కూర్చుని కిమ్ ఈ విషయాలు చెప్పారు. ఒకవైపంతా పుస్తకాల షెల్ఫులు, తన తండ్రి కిమ్ జోంగ్ 2, తాత కిమ్ 2 సంగ్‌ల భారీ పెయింటింగులు వెనకాల ఉండేలా చూసుకున్నారు. అలాగే బాగా ముదురురంగు సూట్, నీలం రంగు టై కట్టుకుని టేబుల్ మీద 12 గంటలు సమయం అయినట్లుగా చూపిస్తున్న ఒక గడియారం పెట్టుకుని మాట్లాడటం మొదలుపెట్టారు. అయితే మాట్లాడే సమయంలో మాత్రం ఆ గడియారంలో సమయం బ్లర్ అయినట్లుగా కనిపించింది. చివరకు ప్రసంగం ముగిసేసరికి ఒంటిగంట అయ్యింది. అంటే, మధ్యలో పలుమార్లు ఆపి, మళ్లీ రికార్డు చేసినట్లు అర్థమవుతోంది.


'వినయ విధేయ రామ' చిత్రంలో ఓ దృశ్యం

ఈరోజు 'మిస్టర్ మజ్ను' టీజర్


● అఖిల్

అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో భారీ నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. ప్రస్తుతం ఈ చిత్రం చిత్రీకరణ దశలో ఉంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి జనవరి 25న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన 'ఏమైనదో.. ఏమైనదో.. పలుకు మరచినట్టు పెదవికేమైనదో..' , మిస్టర్ మజ్ను టైటిల్ సాంగ్‌కు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. కాగా, జనవరి 2 సాయంత్రం 6 గంటలకు నూతన సంవత్సర కానుకగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేయనున్నారు. అఖిల్ అక్కినేని సరసన నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: థమన్, పాటలు: శ్రీమణి, సినిమాటో గ్రఫీ: జార్జ్ సి. విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: అవినాష్ కొల్లా, కొరియోగ్రఫీ: శేఖర్, నిర్మాత: బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వెంకీ అట్లూరి.


● రాజశేఖర్

'కల్కి' ఫస్ట్‌లుక్ విడుదల

డా.రాజశేఖర్ నటించిన 'పి.ఎస్.వి.గరుడవేగ' బాక్సాఫీస్ వద్ద సెన్సేషనల్ విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. పవర్‌ఫుల్ రోల్స్‌తో తనకంటూ ఓ ఇమేజ్‌ను క్రియేట్ చేసుకున్న కథానాయకుడు డా.రాజశేఖర్, 'అ!' చిత్ర దర్శకుడు ప్రశాంత్‌వర్మ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'కల్కి'. శివానీ శివాత్మిక మూవీస్ సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై రూపొందుతోన్న ఈ చిత్రాకి సి.కల్యాణ్, శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ నిర్మాతలు. ఈ చిత్రంలో అదాశర్మ, నందితాశ్వేత, స్కార్లెట్ విల్సన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అశుతోష్ రానా, నాజర్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. 1983 బ్యాక్‌డ్రాప్‌లో సినిమా కథాంశం సాగుతుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను నూతన సంవత్సరం సందర్భంగా విడుదల చేశారు.

రవిబాబు 'ఆవిరి'

తన ప్రతి సినిమా విభిన్నంగా ఉండాలని కోరుకునే దర్శకుడు రవిబాబు. ఎప్పటికప్పుడు కొత్తదనంతో ఉన్న సినిమాలను రూపొందించేందుకు రవిబాబు ఇష్టపడతారు. ఇటీవల వచ్చిన 'అదుగో' చిత్రాన్ని పందిపిల్ల ప్రధాన పాత్రలో రూపొందించిన ఆయన ఇప్పుడు మరో ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. 'ఆవిరి' పేరుతో ఫ్లైయింగ్ ఫ్రాగ్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తన తదుపరి చిత్రాన్ని ప్రకటించారు రవిబాబు. ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తారు.





భిన్నమైన క్యారెక్టర్‌లో...

విభిన్నమైన పాత్రలు పోషిస్తూనే గ్లామర్ ప్రాధాన్యమున్న క్యారెక్టర్స్‌లోనూ తన అందచందాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న అమలాపాల్ ఇప్పుడు ఆమె కెరీర్‌లోనే ఓ డిఫరెంట్ క్యారెక్టర్ చేయబోతోంది. ఇప్పటివరకు ఇండియాలోనే ఈ తరహా క్యారెక్టర్‌ను ఎవరూ పోషించలేదని చిత్ర యూనిట్ చెబుతోంది. అభిలాష్ పిళ్లై రచనలో అనూప్ పణికర్ దర్శకత్వం వహిస్తున్న ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌లో అమలాపాల్ ఫోరెన్సిక్ సర్జన్‌గా నటించనుంది. ఒక మర్డర్ కేసు మిస్టరీని ఛేదించే కథతో ఈ చిత్రం రూపొందనుంది. ఏజీ ఫిలింస్, వైట్ స్క్రీన్ మీడియా బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ వచ్చే మార్చిలో ప్రారంభమవుతుంది.


● అమలాపాల్

రెజీనా లెస్బియన్!



తెలుగులో పలు సూపర్‌హిట్ చిత్రాల్లో నటించి అందర్నీ మెప్పించిన హీరోయిన్ రెజీనా. ప్రస్తుతం 'ఏక్ లడకీ కొ దేఖా తో ఐసా లగా' అనే హిందీ సినిమా చేస్తోంది. లెస్బియన్స్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో సోనమ్ కపూర్ ప్రధాన పాత్రలో కనిపిస్తుండగా ఆమెకు ప్రేయసి గా రెజీనా నటిస్తోంది. సోనమ్, రెజీనా మధ్య నడిచే ప్రేమకథే హైలైట్‌గా ఈ సినిమా ఉంటుంది. షెల్లీ చోప్రాధర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాని ఫిబ్రవరి 1న విడుదల చేసేం దుకు ప్లాన్ చేశారు.

లోక్‌సభల్లో ఎన్నికల్లో పోటీ చేస్తా

నూతన సంవత్సరం సందర్భంగా నటుడు ప్రకాష్‌రాజ్ ఓ సంచలన ప్రకటన చేశారు. ఈ ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకాష్‌రాజ్ ప్రకటించారు. తాను ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేసేది త్వరలో చెబుతానని ఆయన పేర్కొన్నారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నానని ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఈసారి జరిగే ఎన్నికల్లో ప్రజల ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ఓ గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయడంతోపాటు గతంలో తెలంగాణ సీఎం కేసీఆర్‌ను కలిసి మాట్లాడారు.


● ప్రకాష్‌రాజ్

ఖాదర్ ఖాన్ ఇకలేరు



రచయిత, నటుడు ఖాదర్ ఖాన్ కన్నుమూశారు. లెక్కకు మించిన హిందీ సినిమాలకు రచయితగా పనిచేయడమే కాకుండా కొన్ని వందల సినిమాల్లో తన నటనతో అలరించిన ఖాదర్ ఖాన్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కెనడాలో ఆయన చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచినట్టు ఆయన కుమారుడు సర్ఫరాజ్ తెలిపారు. 1973లో 'ధాగ్' చిత్రం ద్వారా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఖాదర్ ఖాన్ ఎన్నో సూపర్‌హిట్ సినిమాలకు మాటలు అందించారు. మొత్తంగా 300కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన 250 చిత్రాలకు మాటలు రాశారు. ఖాదర్ ఖాన్ మృతి పట్ల బాలీవుడ్ చిత్ర పరిశ్రమ తమ సంతాపాన్ని తెలియజేసింది.


● ఇంద్ర, సుకృత

రామ చక్కని సీత

ఇంద్ర, సుకృత వాగ్లే జంటగా శ్రీహర్ష మండ తెరకెక్కిస్తున్న చిత్రం 'రామ చక్కని సీత'. ఇంద్ర ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నారు. మహాకవి వాల్మీకి రాసుకున్న రామాయణం నిజం అయితే తన కథ కూడా నిజమే అంటున్నాడు దర్శకుడు శ్రీహర్ష మండ. ఆయన తెరకెక్కిస్తున్న 'రామ చక్కని సీత' షూటింగ్ ఇప్పటికే 70 శాతం పూర్తయింది. క్రొకోడైల్ క్రియేషన్స్ మరియు లియో సెల్యులాయిడ్స్ బ్యానర్స్‌పై విశాలక్ష్మి మండ, జి.ఎల్ ఫణికాంత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సినిమా ఆద్యంతం వినోదాత్మకంగా అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఉంటుందని చెబుతున్నారు దర్శక నిర్మాతలు. జనవరి 1న నూతన సంవత్సరం సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో ప్రియదర్శి, కాశీ విశ్వనాథ్, అభయ్, బుల్లెట్ భాస్కర్, జబర్దస్త్ అప్పారావు, మధు మణి, రాహుల్ సిప్లిగంజ్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. కేశవ కిరణ్ సంగీతం అందిస్తుండగా.. మురుగన్ గోపాల్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. గ్యారీ బి హెచ్ ఎడిటింగ్ చేస్తున్నారు. నటీనటులు ఇంద్ర, సుక త వాగ్లే, కాశీ విశ్వనాథ్, ప్రియదర్శి, అభయ్, బుల్లెట్ భాస్కర్, జబర్దస్త్ అప్పారావు, మధు మణి, రాహుల్ సిప్లిగంజ్ తదితరులు సాంకేతిక నిపుణులు రచన-దర్శకత్వం: శ్రీ హర్ష మండ, నిర్మాతలు:విశాలక్ష్మి మండ, జి.ఎల్ ఫణికాంత్, సంగీతం: కేశవ కిరణ్ , సినిమాటోగ్రఫీ: మురుగన్ గోపాల్, ఎడిటర్: గారి బి హెచ్, ఆర్ట్: నాగేంద్ర , స్టంట్స్: రియల్ సతీష్, కొరియోగ్రఫీ: సన్నీ, పి ఆర్ ఓ: వంశీ శేఖర్, కాస్ట్యూమ్ డిజైనర్: నరేన్, లిరిక్స్: చైతన్య ప్రసాద్, సాగర్, శ్రీ హర్ష మండ పబ్లిసిటీ డిజైనర్: ఓంకార్ కడియం.

మార్కెట్లు శుభారంభం

కొత్త ఏడాదికి లాభాలతో స్వాగతం పలికిన దేశీయ చూచీలు

- ప్రారంభంలో కలవర పెట్టినా చివరకు లాభాలతో ముగింపు
- సెనెక్స్ 186 పాయిట్ల లాభానికి 36,254 గా నమోదు
- నిఫ్టీ 47 పాయింట్ల లాభంతో తిరిగి 10,900 మార్క్
- రూపాయి విలువ పెరగటం, చమురు ధరల తగ్గుదలే ప్రధాన కారణం
- డాలర్‌తో రూపాయి విలువ 34 పైసలు జంప్
- బులియన్ మార్కెట్లలోనూ సానుకూల పవనాలు
- 10 గ్రాములకు రూ. 200 పెరిగన పసిడి
- కిలో వెండికి రూ. 39,250గా నమోదు



ముంబై: స్టాక్ మార్కెట్లలో కొత్త సంవత్సరం జోరు కనిపించింది. 2019లోకి అడుగు పెడుతూనే దేశీయ సూచీలు సెనెక్స్, నిఫ్టీ లాభాలను నమోదు చేశాయి. అయితే ఉదరయం ట్రేడింగ్ ప్రారంభమైనప్పుడు మాత్రం అంత రెండు సూచీలు నిరాశాజనకంగా ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ముఖ్యంగా సెనెక్స్ 130 పాయింట్లకు పైగా నష్టాల్లో ట్రేడింగ్ సాగించింది. ఇలా మధ్యాహ్నం సెషన్ వరకూ కొనసాగీ మదుపరులను కలవరపరిచాయి. అయితే సెషన్ చివరి సమయాల్లో మాత్రం తిరిగి పుంజుకున్న మార్కెట్లు కొత్త సంవత్సరానికి లాభాలతో స్వాగతం పలికింది. కాగా, 2018 చివరి సెషన్లో సెనెక్స్ 8 పాయింట్ల నష్టాన్ని నిఫ్టీ 3 పాయింట్ల నష్టాన్ని నమోదు చేసి ఫ్లాట్‌గా ముగించాయి. ఇక మంగళవారంనాటి ట్రేడింగ్‌లో ప్రారంభంలో నష్టాలు రావడానికి ప్రధాన కారణం విదేశీ మదుపరులు పెట్టుబడులను ఉపసంహరించుకునేందుకు మొగ్గు చూపడంతో కొంత కలవరపాటుకు గురైన విషయం నిజమేనని స్టాక్ బ్రోకర్లు అన్నారు. విదేశీ పెట్టుబడులు స్వల్పంగా తగ్గినప్పటికీ చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, ఈక్విటీ మార్కెట్ల నష్టాల్లో సైతం రూపాయి బలపడటం వంటి అంశాలు లాభాలు నమోదయ్యేందుకు దోహదం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఇక మంగళవారం ట్రేడింగ్‌లో 186 పాయింట్లు (0.52 శాతం) బలపడిన సెన్సెక్స్ 36,254 వద్ద ముగిసింది. నిఫ్టీ 47 పాయింట్ల (0.44 శాతం) లాభంతో మళ్లీ క్లిష్టమైన 10,910 మార్క్‌ను చేరుకుంది. 30 షేర్ల బెంచ్ మార్క్ నిఫ్టీ ఇండెక్స్‌లో భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, ఎస్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకులు లాభాలను నమోదు చేశాయి. ఎం అండ్ ఎం, టాటా స్టీల్, ఓఎన్‌జీసీ, హిందూస్థాన్ యూనీలివర్, కోటక్ బ్యాంకు షేర్లు కాస్త వెనుక బడ్డాయి. ఇక డాలర్‌తో రూపాయి విలువ 34 పైసలు బలపడి 69.43 వద్ద ముగిసింది.



మెరిసిన బంగారం

బంగారం కొత్త ఏడాది తొలి రోజే తలుక్కుమంది. లాభాలు నమోదు చేసింది. ఢిల్లీ బులియన్ మార్కెట్‌లో పసిడి ధర మంగళవారం పెరిగింది. 10 గ్రాముల బంగారం ధర రూ. 200 పెరుగుదలతో రూ. 32,470కు ఎగసింది. డిమాండ్ పుంజుకోవడం ఇందుకు ప్రధాన కారణం. బంగారం బాటలోనే వెండి ధర కూడా పెరిగింది. పరిశ్రమలు, నాణేల తయారీ దారుల నుంచి ఆదరణ పెరగడంతో వెండి ధర కేజీకి రూ. 150 పెరుగుదలతో రూ. 39,250కు పరుగులు పెట్టింది. డిమాండ్ పుంజుకోవడంతో బంగారం ధర ర్యాలీ చేసిందని బులియన్ ట్రేడర్లు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా చూస్తే.. న్యూయార్క్ మార్కెట్‌లో బంగారం ధర ఔన్స్‌కు 1,284.7 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ధర ఔన్స్‌కు 15.56 డాలర్ల వద్ద కదలాడుతోంది. దేశ రాజధానిలో 10 గ్రాముల 99.9 స్వచ్ఛత గల బంగారం ధర రూ. 200 పెరుగుదలతో రూ. 32,470కి, 99.5 స్వచ్ఛత గల బంగారం ధర కూడా రూ.200 పెరుగుదలతో రూ. 32,320కు చేరింది. 2017తో పోలిస్తే 2018లో బంగారం ధర రూ.1,870 (6.15 శాతం) మేర ఎగసింది. అయితే వెండి ధర మాత్రం రూ. 880 (2.2 శాతం) క్షీణించింది.



అలహాబాద్ బ్యాంకులో ఎస్‌బీఐ లైఫ్ పొత్తు



న్యూఢిల్లీ: అలహాబాద్ బ్యాంకు, దేశంలోని అతిపెద్ద బీమా సంస్థల్లో ఒక్కటైన ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లు 'బ్యాంక్ అస్యూరెన్స్' భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి. దీంతో అలహాబాద్ బ్యాంక్‌కు చెందిన 3238 శాఖల్లో ఎస్‌బిఐ లైఫ్ యొక్క విస్తృత శ్రేణి రక్షణ, సేవింగ్ ఉత్పత్తులను తమ వినియోగదారులకు అందించనుంది. వినియోగదారుల ఆర్థిక అవసరాలన్నీ కూడా ఒకే చోట తీర్చుకునేందుకు ఇది సహాయపడుతుందని అలహాబాద్ బ్యాంకు సిఇఒ, ఎండి మల్లి కార్జున రావు పేర్కొన్నారు. తమ శాఖల్లో జీవిత బీమా ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో పాటుగా బ్యాంకు యొక్క వడ్డీయేతర ఆదాయాన్ని వృద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు. అలహాబాద్ బ్యాంకుతో భాగస్వామ్యం వల్ల తమకు లభించే అవకాశాలు మరింత పెరగనున్నాయని ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండి, సిఇఒ సంజీవ్ నౌటియాల్ పేర్కొన్నారు. వినియోగదారులు ఇప్పుడు ఎస్‌బిఐ లైఫ్ యొక్క ప్రొటెక్షన్, వెల్త్ క్రియేషన్, సేవింగ్స్ ఉత్పత్తులను నేరుగా పొందడంతో పాటుగా సంపూర్ణమైన ఆర్థిక ప్రణాళిక పరిష్కారాలను పొందగలరన్నారు. తమ పంపిణీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకోవడంతో పాటు సామాన్య ప్రజలకు బీమాను మరింత చేరువ చేయడానికి ఈ భాగస్వామ్యం దోహదం చేయనుందని నైటియాల్ పేర్కొన్నారు.

మారుతి అమ్మకాల్లో క్షీణత



న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి డిసెంబర్ అమ్మకాలు మార్కెట్ వర్గాలను మెప్పించలేకపోయాయి. కంపెనీ ఈ డిసెంబర్‌లో మొత్తం 1.28 లక్షల వాహన విక్రయాలు జరిగాయి. అయితే నోమురా సంస్థ డిసెంబర్‌లో 1.30లక్షల వాహన విక్రయాలు జరగవచ్చని అంచనావేసింది. గతేడాది ఇదే నెలలో జరిగిన దేశీయంగా అమ్మకాలతో పోలిస్తే స్వల్పంగా 1.8శాతం పెరిగాయి. ఈ నెలలో మొత్తం 1.21 లక్షలుగా నమోదయ్యాయి. అయితే విదేశాలకు ఎగుమతులు మాత్రం 36.4శాతం క్షీణించి 6,859 యూనిట్లుగా నమోదయ్యాయి. డిసెంబర్‌లో ఆర్థిక వ ద్ధి మందగమనంతో పాటు, ప్యాసింజర్ కార్ల అమ్మకాలు క్షీణత విక్రయాలపై ప్రభావాన్ని చూపినట్లు కంపెనీ తెలిపింది. పాసింజర్ అమ్మకాలు 4.7శాతం క్షీణించి 83,729 యూనిట్లుగా నమోదయ్యాయి. చిన్న కార్ల(ఆల్టో, వేగనార్) అమ్మకాలు 14శాతం క్షీణించగా, కాంపాక్ట్(సిఫ్ట్, సెలెరియో, ఇగ్నిస్, బలెనో, డిజౌర్, టూర్ ఎస్) కార్ల అమ్మకాలు కాంపాక్ట్(సిఫ్ట్, సెలెరియో, ఇగ్నిస్, బలెనో, డిజౌర్, టూర్ ఎస్) కార్ల అమ్మకాలు 3.8శాతం తగ్గాయి. కాలుష్యరహిత వాహనాలకు డిమాండ్ పెరగడంతో యుటిలిటీ వాహన విక్రయాలు 4.9శాతం పెరిగాయి. తేలికపాటి కమర్షియల్ విభాగంలో కంపెనీ 1,675 యూనిట్లను అమ్మింది. ఆశించిన స్థాయిలో విక్రయ గణాంకాలు నమోదుకాకపోడంతో ఇంట్రాడే మారుతి సుజుకీ షేరు స్తబ్దుగా ట్రేడ్ అవుతోంది. మధ్యాహ్నం గం.2:30ని.లకు షేరు గతముగింపు(రూ.7462.3)తో పోలిస్తే 0.10శాతం నష్టపోయి రూ.7455.70ల వద్ద ట్రేడ్ అవుతోంది.

హువావే నుంచి కొత్త ఫోన్



న్యూఢిల్లీ: చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీదారు 'హువావే' కొత్త సంవత్సర కానుకగా సరికొత్త స్మార్ట్‌ఫోన్‌ను తీసుకొచ్చింది. హువావే 'పి స్మార్ట్ (2019)' పేరుతో తీసుకొచ్చిన ఈ ఫోన్‌ను తాజాగా యూరప్ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ కొత్త ఫోన్‌లో 6.21 అంగుళాల భారీ డిస్‌ప్లేను ఏర్పాటు చేశారు. వెనుక భాగంలో 13, 2 మెగాపిక్సల్ కెమెరాలు రెండు ఉన్నాయి. ముందు భాగంలో 8 మెగాపిక్సల్ కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ ఫోన్ 3 జీబీ ర్యామ్, 32/64 జీబీ స్టోరేజ్, 512 జీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్ వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. మిడ్ నైట్ బ్లాక్, అరోరా బ్లూ, సఫైర్, టార్టాయిస్ బ్లూ కలర్ ఆప్షన్లలో వచ్చిన ఈ ఫోన్ వినియోగదారులకు జనవరి 10 నుంచి లభ్యం కానుంది. యూకేలో ఈ ఫోన్ ధర 249 యూరోలు అంటే మన కరెన్సీలో రూ. 20,330 గా ఉంది.

భారీగా తగిన ఇంధరన ధరలు

పెట్రోల్ డీజిల్ కంటే తక్కువకే విమాన ఇంధనం



న్యూఢిల్లీ: విమాన ఇంధనం(ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్) ధరలు మంగళవారం భారీగా తగ్గాయి. అంతర్జాతీయంగా తగ్గిన ధరలతో 14.7 శాతం ధరలు తగ్గాయి. దీంతో అంతర్జాతీయంగా విమాన ఇంధన ధరలు పెట్రోల్, డీజిల్‌ల కంటే కూడా తక్కువగా నమోదు కావడం విశేషం. ఈ ప్రభావం కూడా చివరి నిమిషంలో మార్కెట్లు బలపడటానికి కారణమైందని చెప్పొచ్చు. కాగా, ఏటీఎఫ్‌పై తగ్గిన ధరలతో ఒక్క రోజులోనే కిలో లీటర్‌పై రూ. 9,990 తగ్గి రూ. 58,060-.97గా నమోదైనట్లు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. వరుసగా రెండు నెలల్లో రెండో సారి ఇంధన ధరల్లో తగ్గుదల నమోదైనట్లు నోటిఫికేషన్ ద్వారా తెలిసింది. అయితే ఒకే రోజు 14.7 శాతం తగ్గుదల నమోదు కావడం ఇదే ప్రథమమని ఆయా సంస్థలు పేర్కొన్నాయి. ఇంతకు ముందు ధరలు తగ్గినప్పుడు డిసెంబర్ 1న 10.9 శాతం తగ్గుదలను నమోదు చేసినట్లు తేలింది. ప్రస్తుతం ఉన్న ఈ ధరలతో ఇంధన ధరలు దేశంలోని చాలా నగరాలతో పోల్చుకుంటే పెట్రోల్, డీజిల్ ధరల కంటే చాలా తక్కువ. అదే విధంగా ముంబై లాంటి నగరాలతో పోల్చుకుంటే ప్రభుత్వం పంపిణీచేసే కిరోసిన్ కాకుండా నేరుగా విక్రయించే కిరోసిన్ కంటే కొద్దిగా ఎక్కువ. దేశంలో రద్దీ ఎక్కువగా ఉండే ఎయిర్‌పోర్ట్ అయిన ముంబైలో కిలో లీటర్ ఏటీఎఫ్ ధర రూ. 58.01గా ఉండగా అదే నగరంలో పెట్రోల్ ధర రూ. 74.30, డీజిల్ ధర రూ. 65.56గా ఉంది. దీన్ని బట్టి ఎంత మొత్తంలో ఏటీఎఫ్ ధరలు తగ్గాయనేది అర్థమవుతోంది. అయితే ఈ ధరలో పట్టణానికి పట్టణానికి మధ్య స్వల్ప తేడాలు ఉంటాయి.

వంటగ్యాస్‌పై రూ. 6 వరకూ తగ్గింపు



నూతన సంవత్సరం సందర్భంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) వినియోగదారులకు ఊరటనిచ్చే వార్తను అందించింది. నెల రోజుల వ్యవధిలోనే మరోసారి వంటగ్యాస్ సిలిండర్ ధర తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. మార్కెట్ ధర తగ్గడంతో 14.2కేజీల రాయితీ సిలిండర్‌పై రూ.5.91 మేర తగ్గిస్తున్నట్లు తెలిపింది. దీంతో దేశ రాజధాని దిల్లీలో సిలిండర్ ధర రూ.500.90 నుంచి రూ.494.99కి చేరినట్లు ఐఓసీ వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. నేటి అర్ధరాత్రి నుంచి తగ్గింపు ధరలు అమల్లోకి వస్తాయి. నవంబరు 30న రాయితీ సిలిండరుపై రూ.6.52, రాయితీయేతర సిలిండర్లపై రూ.133 మేర ధరలు తగ్గించిన విషయం తెలిసిందే. జూన్ నుంచి సిలిండరు ధర పెరుగుతూనే రాగా.. నవంబరులో తగ్గింది. ఈ ఆరు నెలల్లో రూ.14.13 మేర గ్యాస్ ధర పెరిగింది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం, డాలరుతో పోలిస్తే రూపాయి విలువ కొంత బలపడటంతో వంటగ్యాస్ ధరలు తగ్గినట్లు ఐఓసీ వెల్లడించింది. ఇక సబ్సిడీయేతర సిలిం డర్‌పై రూ.120.50 తగ్గిస్తున్నట్లు తెలిపింది. దిల్లీలో సబ్సిడీయేతర సిలిండర్ ధర ప్రస్తుతం రూ.809.50 ఉండగా.. ఇప్పుడు రూ.689కి చేరింది. సంవత్స రకాలంలో గృహ వినియోగాలకు వినియోగించే 12 సిలిండర్లకు సబ్సిడీ అందుతుంది.



దిగొచ్చిన పెట్రోల్, డీజిల్

కొత్త ఏడాదిలో ఇంధన ధరలు మరింత దిగొచ్చాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుతుండటంతో గత కొన్ని రోజులుగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుముఖం పట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది తొలిరోజున కూడా ఇంధన ధరలు మరికాస్త తగ్గాయి. దేశ రాజధాని దిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 19 పైసలు తగ్గి రూ. 68.65గా ఉంది. లీటర్ డీజిల్ ధర కూడా 20 పైసలు తగ్గి 62.66గా ఉంది. ఇక ఆర్థిక రాజధాని ముంబయిలో లీటర్ పెట్రోల్ ధర రూ. 74.30, కోల్‌కతాలో రూ. 70.78, చెన్నైలో రూ. 71.23, హైదరాబాద్‌లో రూ. 72.82గా ఉంది. ఇక డీజిల్ ధర ముంబయిలో లీటర్‌కు రూ. 65.56, కోల్‌కతాలో రూ. 64.42, చెన్నైలో రూ. 66.15, హైదరాబాద్‌లో రూ. 68.11గా ఉంది. రూపాయి పతనం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడంతో గతేడాది ఆగస్టు-సెప్టెంబరు కాలంలో చుక్కలను తాకిన ఇంధన ధరలు.. ఆ తర్వాత అక్టోబరు 18 నుంచి తగ్గుముఖం పట్టాయి. తాజాగా ఏడాది కనిష్ఠానికి పడిపోయాయి.



ఆ సొమ్ము టెక్ మహీంద్రాదే

హైదరాబాద్: టెక్ మహీంద్రాకు ఉమ్మడి హైకోర్టులో ఊరట లభించింది. ఈ కంపెనీకి చెందిన సత్యం కంప్యూటర్ సర్వీసెస్ లిమిటెడ్ పేరు మీద ఉన్న రూ.822 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఈ సొమ్మును జప్తు చేస్తూ ఈడీ జారీ చేసిన ఆదేశాలను న్యాయస్థానం రద్దు చేసింది. దశాబ్ద కాలం క్రితం ఖాతాల కుంభకోణంలో చిక్కుకున్న సత్యం కంప్యూటర్ సర్వీసెస్‌ను, టెక్ మహీంద్రా టేకోవర్ చేసిన విషయం తెలిసిందే. 2012లో సత్యం కంప్యూటర్‌కు చెందిన రూ. 822 కోట్ల మొత్తాన్ని ఈడీ జప్తు చేసింది. దీన్ని సవాలు చేస్తూ టెక్ మహీంద్రా హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ వి.రామసుబ్రమణ్యం, జస్టిస్ పి. ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. టెక్ మహీంద్రా తరపున న్యాయవాది కే వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ సత్యం కంప్యూట ర్స్‌లో అక్రమ సొమ్ము లేదని, ఈ సొమ్ము టెక్ మహీంద్రాకు చెందినదేనని తెలిపారు.



పేటీఎం సేవలు కొనసాగించొచ్చు

న్యూఢిల్లీ: కొత్త ఏడాది ఆరంభంలో పేమెంట్ సేవల సంస్థ పేటీఎం పేమెంట్స్ బ్యాంకుకు భారీ ఊరట లభించింది. గత ఏడాది నిలిచిపోయిన బిజినెస్‌ను తిరిగి ప్రారంభించేందుకు రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గ్రీన్‌సిగ?్నల్ ఇచ్చింది. ఈవాలెట్లను తెరుచుకునేందుకు, కొత్త కొస్టమర్ల నమోదుకు అనుతినిచ్చింది. దీంతో తన బ్యాంకింగ్ సేవలను మరింత మెరుగుపరచడానికి సంబంధిత వినియోగదారుల కేవైసీ ప్రాసెస్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. వన్‌9 కమ్యూనికేషన్స్, విజయ్శేఖర్ శర్మ సహ యాజమాన్యంలోని పేటీఎం బ్యాంకులో కెవైసీ నిబంధనలు ఉల్లంఘనల ఆరోపణలతో గత ఏడాది జూన్‌లో కొత్త కస్టమర్లను నమోదును ఆర్‌బీఐ నిలిపివేసింది. అలాగే బ్యాంక్ సీఈవో రేణు సత్తిని తొలగించి, కొత్త సీఈవో, ఎండీగా సతీష్ గుప్తాను నియమించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దాదాపు 32 సంవత్సరాల అనుభవం కలిగిన సతీష్ గుప్తా ఒక అనుభవజ్ఞుడైన బ్యాంకరు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (%చీూ%) తో చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసిన అనుభవం కూడా ఉంది. కాగా పేటీఎం పేమెంట్స్ బ్యాంకులో సుమారు 42 మిలియన్ల ఖాతాలుండగా, 2019 చివరి నాటికి100మిలియన్ల వినియోగదారులను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.



హైదరాబాద్‌కు మాంగళ్య స్టోర్

జనవరి 3న ప్రారంభం... ముఖ్య అతిథిగా కేటీఆర్

హైదరాబాద్: అత్యుత్తమ వస్త్ర ఉత్పత్తుల సంస్థ మాంగళ్య హైదరాబాద్‌లో తన నూతన షోరూంను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. జనవరి 3న ఈ షోరూం అందుబాటులోకి రానునందని తెలిపారు. ఈ నూతన షోరూం ప్రారంభోత్సవానికి టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సినీ నటి కాజల్ అగర్వాల్ హాజరు కానున్నారు. మధీనాగూడాలో 20,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ షోరూం అందుబాటులోకి రానుందని, ఇందుకు రూ. 10 కోట్ల వెచ్చించినట్లు సంస్థ డైరెక్టర్ కాసం శివప్రసాద్ తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఈ షోరూం ద్వారా 200 నుంచి 250 మందికి ఉపాధి లభించనుందని మరో డైరెక్టర్ పీ అరుణ్ కుమార్ తెలిపారు. కాగా, ఫిబ్రవరి చివరి నాటికి మరో స్టోర్‌ను డిమాండును బట్టి మరో నాలుగు స్టోర్లను తీసుకువచ్చే యోచనలో ఉన్నట్లు తెలిపారు. కాగా, మాంగళ్య సంస్థ వరంగల్ కేంద్రంగా పని చేస్తోంది. ఈ సంస్థకు హన్మకొండ, సిద్దిపేట, కరీంనగర్‌లలో స్టోర్‌లు ఉన్నాయి. అన్ని స్టోర్లలో కలిపి 1,500 మంది వరకూ పని చేస్తున్నారు.



ఆఫ్‌లైన్ స్టోర్లపై రియల్ మి దృష్టి

హైదరాబాద్: ప్రముఖ స్మార్ట్ ఫోన్ దిగ్గజం రియల్ మి తన విస్తరణపై దృష్టి సారించినట్లు ఇటీవలి కంపెనీ చర్యల ద్వారా తెలుస్తోంది. కాగా, ఇప్పటి వరకూ అన్‌లైన్‌లో మాత్రమే అమ్మకాలు సాగించే రియల్ మి ఇప్పుడు ఆఫ్‌లైన్‌లో తమ ఫోన్లను విక్రయించడానికి మొగ్గుచూపుతోంది. దీనిపై స్పందించిన రియల్ మి ఫలు దఫాల వారీగా 150 నగరాల్లో తమ ఆఫ్‌లైన్ కార్యకలాపాలను సాగించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం దేశంలో 10 ప్రధాన నగరాల్లో ఆఫ్‌లైన్ స్టోర్లు ఉండగా త్రైమాసికానికి 50 చొప్పున సోర్లను విస్తరించనున్నట్లు పేర్కొంది. కాగా, మొత్తం 150 నగరాల్లో కలిపి 20,000 ఔట్లెట్లను ఏర్పాటు చేయనున్నామని రియల్‌మి ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాధవ్ తెలిపారు. గతంలో రియల్ మి ఫోన్ల విక్రయానికి జియో స్టోర్లతో ప్రత్యేక ఒప్పందాన్ని చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దాని ద్వారా ప్రస్తుతం 130 నగరాల్లో 1,300లకు పైగా రిలయన్స్ డిజిటల్, మై జియో స్టోర్లలో రియల్ మి ఫోన్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

దిగజారుతున్న ఆసీస్ సెలక్షన్ ప్రక్రియ

• టీమిండియా మాజీ కెప్టెన్ గంగూలీ



ముంబై: టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ వాస్తవాలను చెప్పేందుకు అస్సలు వెనుకాడడు. జట్టుకు ఆడుతున్నప్పుడూ అంతే. బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగానూ అలాగే ప్రవర్తిస్తున్నాడు. తాజాగా ఆస్ట్రేలియా క్రికెట్ ఆటగాళ్ల ఎంపిక ప్రక్రియ ఎన్నడూ చూడనంత ఘోరంగా తయారైందని గంగూలీ విమర్శించాడు. ప్రస్తుతం దిగ్గజాలు జట్టును ఎలా ఎంపిక చేయాలో దిశానిర్దేశం చేస్తున్నారని వెల్లడించాడు. బాల్ టాంపరింగ్ వివాదంలో స్టీవ్‌స్మిత్, డేవిడ్ వార్నర్, బాన్‌క్రాఫ్ట్‌ను నిషేధించిన తర్వాత ఆ జట్టు బ్యాటింగ్ ఆర్డర్ ఘోరంగా విఫలమైంది. అనుభవ లేమి, నిలకడ లోపంతో ఇబ్బంది పడుతోంది. మాజీ క్రికెటర్ స్టీవ్ వా టీమిండియాతో సిడ్నీలో జరిగే నాలుగో టెస్టు మ్యాచ్‌కు ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు ఎలా ఉండాలో ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటించాడు. ' సిడ్నీ టెస్టుకు ఎంపికైన జట్టులో నా బ్యాటింగ్ ఆర్డర్' అని ఆటగాళ్ల పేర్లు రాశాడు. ఈ పోస్టును చూసి దాదా స్పందించాడు. 'ఆస్ట్రేలియా క్రికెట్ ఎంపిక ప్రక్రియ ఎన్నడూ చూడనంత పాతాళానికి దిగజారింది. దిశానిర్దేశం చేసేందుకు దిగ్గజాలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు చేస్తున్నారు' అని పేర్కొన్నాడు. టీమిండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఫిట్‌నెస్‌పై దాదా ఆందోళన వ్యక్తం చేశాడు.

శ్రీలంకకు షాక్



దుబాయ్: టీ20 మాజీ చాంపియన్ శ్రీలంక, పొరుగు దేశం బంగ్లాదేశ్‌కు షాక్ తగిలింది. ఈ రెండు జట్లు 2020లో జరిగే పురుషుల టీ20 ప్రపంచకప్ సూపర్-12కు నేరుగా అర్హత సాధించలేదు. తక్కువ ర్యాంకుల వల్ల గ్రూప్ దశలో పోటీ పడాల్సిందే. పాకిస్థాన్, భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్, అఫ్గానిస్థాన్ నేరుగా సూపర్-12కు అర్హత సాధించాయని ఐసీసీ మంగళవారం ప్రకటించింది. మూడు సార్లు పొట్టి క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్‌కు వెళ్లిన శ్రీలంక నేరుగా అర్హత సాధించకపోవడం బాధాకరం. గ్రూప్ దశలో మిగతా ఆరు జట్లతో బంగ్లా, శ్రీలంక పోరాడాల్సి ఉంటుంది. 2020 అక్టోబర్ 18 నుంచి నవంబర్ 15 వరకు టీ20 ప్రపంచకప్ నిర్వహిస్తారు. ఐసీసీ టీ20 ర్యాంకుల జాబితాలో అగ్రస్థానంలోని ఎనిమిది జట్లు నేరుగా సూపర్-12కు అర్హత సాధిస్తాయి. గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచిన నాలుగు జట్లు సూపర్-12కు ఎంపికవుతాయి. శ్రీలంక అనర్హత గురించి కెప్టెన్ లసిత్ మలింగ అసంతృప్తి వ్యక్తం చేశాడు.



భారత్‌తో వన్డే సిరీస్‌కు కమిన్స్ దూరం

మెల్‌బోర్న్: టీమిండియాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్లు పాట్ కమిన్స్, మిచెల్ మార్ష్, జోస్ హేజిల్‌వుడ్ దూరమయ్యారు. 2019లో ఎక్కువ క్రికెట్ ఆడాల్సి ఉండటంతో వీరి పని భారాన్ని తగ్గించాలని క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయించింది. కోహ్లీసేనతో జరిగిన బాక్సింగ్ డే టెస్టులో కమిన్స్ బ్యాటు, బంతితో అద్భుత ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే. ముగ్గురు బౌలర్లకు విశ్రాంతినిస్తే ఆటగాళ్ల ఎంపికలో ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆ జట్టు కోచ్ జస్టిన్ లాంగర్ అన్నాడు. జనవరి 12 నుంచి మూడు వన్డేల సిరీస్ ఆరంభం కానుంది. 'ఎవరిని ఎంపిక చేయాలో గందరగోళంగా ఉంది. మా బౌలర్ల పనిభారాన్ని పర్యవేక్షించాల్సి ఉంది. ఆ ముగ్గురికి వన్డే సిరీస్‌లో విశ్రాంతినిస్తే తర్వాతి రెండు టెస్టులకు ఉత్సాహంగా ఉంచగలం. కమిన్స్ అద్భుతంగా ఆడాడు. ప్రతి మ్యాచ్‌కు అతడిని ఎందుకు ఎంపిక చేయరని మీరు ప్రశ్నిస్తారు? కానీ మనకు వచ్చే ఏడాది ప్రపంచకప్, యాషెస్ ఉన్నాయి. అందుకే కమిన్స్‌ను ఉల్లాసంగా, తాజాగా ఉంచడం మా బాధ్యత' అని లాంగర్ పేర్కొన్నాడు. 2019లో బిజీ షెడ్యూల్ కారణంగా కమిన్స్ ఐపీఎల్‌కూ దూరమైన సంగతి తెలిసిందే.

నా అంచనా తప్పు

• బుమ్రాపై ప్రశంసలు కురిపించిన మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా పర్యటనలో అద్భుత ప్రదర్శన చేస్తోన్న టీమిండియా డెత్ ఓవర్ల స్పెషలిస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. మెల్‌బోర్న్ వేదికగా గత ఆదివారం ముగిసిన బాక్సింగ్ డే టెస్టులో 9 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో బుమ్రా కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే. అంతేకాదు టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఏడాదిలోనే అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత తొలి బౌలర్‌గా బుమ్రా చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. అరంగేట్ర ఏడాదిలో అత్యధిక టెస్టు వికెట్లు తీసిన మూడో బౌలర్ బుమ్రా (48). టెర్రీ ఆల్డర్‌మన్ (1981లో 54), ఆంబ్రోస్ (1988లో 49) బుమ్రా కంటే ముందు ఉన్నారు. దీంతో పాటు ఆస్ట్రేలియా గడ్డపై ఓ టెస్టులో ఉత్తమ గణాంకాలు నమోదు చేసిన భారత పేసర్‌గా కపిల్ (8/109)ను



మెల్ బోర్న్ టెస్టులో బుమ్రా (9/86) అధిగమించాడు. 2018లో మొత్తం 9 టెస్టులాడిన బుమ్రా ఏకంగా 48 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో బుమ్రాపై సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్, సౌరవ్ గంగూలీ తదితరులు ప్రశంసలు కురిపించారు. తాజాగా, ఈ జాబితాలోకి మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ కూడా చేరాడు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జస్ప్రీత్ బుమ్రా గురించి మాట్లాడుతూ 'జస్‌ప్రీత్ బుమ్రా క్రికెట్‌లోకి వచ్చిన కొత్తలో.. అతని బౌలింగ్ శైలిని చూసి ఎక్కువకాలం కొనసాగలేడని అనుకున్నా. నా అంచనా తప్పని అతను తన ప్రదర్శనతో నిరూపించాడు. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టుల్లో అతని ప్రదర్శన అద్భుతం' అని సునీల్ గవాస్కర్ అన్నాడు. బాక్సింగ్ డే టెస్టులో టీమిండియా విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన బుమ్రా మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డుని సైతం అందుకున్నాడు. కాగా, ఈ సిరీస్‌లో చివరిదైన నాలుగు టెస్టు జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా జరగనుంది. ఈ సిరీస్ అనంతరం ఇరు జట్ల మధ్య జనవరి 12 నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.

ఐపీఎల్‌కు బుమ్రా దూరం

వచ్చే వరల్డ్‌కప్‌కు సన్నద్ధమయ్యే క్రమంలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ క్రికెట్ జట్లుకు చెందిన పలువురు కీలక ఆటగాళ్ల ఐపీఎల్‌కు దూరం కానున్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో భారత్‌కు చెందిన కీలక బౌలర్లకు విశ్రాంతి కల్పించాలని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఇటీవలే బీసీసీఐ పరిపాలక కమిటి (సీఓఏ)ముందు తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. కోహ్లీ సూచనపై సీరియస్‌గా దృష్టి సారించిన బోర్డు పెద్దలు ఇప్పుడు అదే పనిలో ఉన్నారు. ప్రధానంగా కీలక బౌలర్లకు ఐపీఎల్ నుంచి విశ్రాంతి కల్పించాలనే యోచనలో ఉన్నారు. రాబోయే సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టు బుమ్రా సేవలను కోల్పోయే అవకాశం ఉందనే విషయాన్ని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఈ క్రమంలోనే త్వరలోనే ముంబై ఇండియన్స్ యాజమాన్యంతో బీసీసీఐ మాట్లాడనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఒకవేళ బుమ్రా ఫిట్‌గా ఉంటే కీలక మ్యాచ్‌ల్లో ఆడించి మిగతా మ్యాచ్‌ల్లో విశ్రాంతి కల్పించాలని బీసీసీఐ ఆలోచన చేస్తోంది. ముఖ్యంగా ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్ దశకు చేరిన పక్షంలో బుమ్రాను ఆడించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం.

క్రికెట్ ఆస్ట్రేలియా కెప్టెన్‌గా కోహ్లీ



మెల్‌బోర్న్: ప్రపంచ క్రికెట్లోని అత్యుత్తమ బ్యాట్స్‌మెన్‌లలో ఒకడైన విరాట్ కోహ్లీని క్రికెట్ ఆస్ట్రేలియా కెప్టెన్‌గా ప్రకటించింది. 2018లో అత్యు త్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లతో ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డ్ అంతర్జాతీయ వన్డే జట్టును అనౌన్స్ చేసింది. ఈ జట్టులో ఆసీస్ ఆటగాళ్లెవరికీ చోటు దక్కకపోవడం గమనార్హం. ఓపెనర్‌గా రోహిత్ శర్మ ఎంపిక కాగా.. మరో ఓపెనర్‌గా ఇంగ్లాండ్ క్రికెటర్ జానీ బెయిర్‌స్టోను ప్రకటించారు. భారత్ నుంచి కుల్‌దీప్ యాదవ్, బుమ్రా కూడా ఈ జట్టుకు ఎంపికయ్యారు. 2018లో 14 వన్డేలు ఆడిన కోహ్లీ.. 133.5 సగటుతో 1200కుపైగా పరుగులు చేశాడు. ఆరు శతకాలు బాదిన విరాట్.. మూడు హాఫ్ సెంచరీలను ఖాతాలో వేసుకున్నాడు. 2018లో విరాట్ అత్యధిక స్కోరు 160 పరుగులు. రోహిత్ 2018లో 19 మ్యాచ్‌ల్లో 73.57 సగటుతో 1030 రన్స్ చేశాడు. కుల్‌దీప్ 45 వికెట్లు తీయగా.. బుమ్రా 22 వికెట్లు పడగొట్టాడు. జో రూట్, హెట్మెయర్, బట్లర్, తిసారా పెరీరా, రషీద్ ఖాన్, ముస్తాఫిజుర్ రహ్మాన్‌లకు క్రికెట్ ఆస్ట్రేలియా వన్డే జట్టులో చోటు దక్కింది.

స్మిత్, బాన్‌క్రాఫ్ట్‌లపై మండిపడ్డ లాంగర్



మెల్‌బోర్న్: తమ దేశ క్రికెట్‌ను కుదిపేసిన టాంపరింగ్ వివాదం ముగిసిపోయిన అధ్యాయమని, మళ్లీ ఇప్పుడు దానిపై పదే పదే చర్చించుకోవడం అనవసరమైన విషయం అని ఆసీస్ కోచ్ జస్టిన్ లాంగర్ పేర్కొన్నాడు. టాంపరింగ్ కారణంగా నిషేధం ఎదుర్కొంటున్న స్టీవ్ స్మిత్, బాన్‌క్రాఫ్ట్‌లు ఇటీవల మీడియాకు ముందుకొచ్చి తమకు ఏ తప్పు తెలియదంటూ మొత్తం విషయాన్ని డేవిడ్ వార్నర్‌పై నెట్టివేసే యత్నం చేశారు. ఆ టాంపరింగ్ వివాదానికి డేవిడ్ వార్నరే కారణమంటూ ఫాక్స్‌స్పోర్ట్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వారు పేర్కొన్నారు. ఇప్పటికే స్మిత్, బాన్‌క్రాఫ్ట్‌ల తీరును పలువురు మాజీలు తప్పుబట్టగా, తాజాగా కోచ్ లాంగర్ సైతం పెదవి విప్పాడు. ఒక చేదు జ్ఞాపకాన్ని వదిలేయకుండా ఒక సీరియల్ డ్రామాలా సాగదీస్తున్నారంటూ ధ్వజమెత్తాడు. స్మిత్, బాన్‌క్రాఫ్ట్ వ్యాఖ్యలు చూస్తే ఆ డ్రామాకు తానొక డైరక్టర్‌నా అనే భావన కలుగుతుందన్నాడు. ఆ ఇంటర్వ్యూ తర్వాత మరొక చికాకును స్మిత్, బాన్‌క్రాఫ్ట్‌లు తెచ్చిపెట్టారంటూ మండిపడ్డాడు. ఇదిలా ఉంచితే, స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లు పునరాగమనం చేసే వరకు టిమ్ పెయిన్, అరోన్ ఫించ్‌లు తమ వేర్వేరు జట్లకు కెప్టెన్లగా కొనసాగుతారని లాంగర్ స్పష్టం చేశాడు.



పెయిన్ కోరిక తీర్చిన పంత్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పెయిన్ సరదాగా తనని కవ్విస్తూ కోరిన కోరికని భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ తీర్చేశాడు. మెల్‌బోర్న్ వేదికగా గత ఆదివారం ముగిసిన మూడో టెస్టు మ్యాచ్‌లో టిమ్ పెయిన్, రిషబ్ పంత్ మైదానంలో పోటాపోటీగా కవ్వింపులకి దిగారు. తొలుత రిషబ్ పంత్ బ్యాటింగ్ చేస్తుండగా టిమ్ పెయిన్ అతడి ఏకాగ్రతని దెబ్బతీసే ఉద్దేశంతో స్లెడ్జింగ్‌కి దిగాడు. 'వన్డే టీమ్‌లోకి వికెట్ కీపర్‌గా మహేంద్రసింగ్ ధోనీ వచ్చేశాడు. ఇక నువ్వు బిగ్‌బాష్ లీగ్‌లోని హరికేన్స్ టీమ్‌కి ఆడతావా..? వారికి ఓ బ్యాట్స్‌మెన్ కావాలి. నీకూ ఆసీస్ హాలిడేస్ పెరిగినట్లవుతాయి. ఇంటి దగ్గర నువ్వు నా పిల్లల్ని ఆడిస్తానంటే.. నా భార్యతో కలిసి నేను సినిమాకి వెళ్తాను' అంటూ పంత్‌పై పెయిన్ కవ్వింపులకి దిగిన సంగతి తెలిసిందే. టిమ్ స్లెడ్జింగ్‌ని మైదానంలో సరదాగా తీసుకున్న రిషబ్ పంత్.. తాజాగా అతని పిల్లలు, భార్యతో కలిసి తీసుకున్న ఫొటోని ఐసీసీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీంతో.. అభిమానులు తమదైన శైలిలో స్పందిస్తూ.. పెయిన్ సరదాని తీర్చేశాడుగా అంటూ కామెంట్లు పెడుతున్నారు. వాస్తవానికి టిమ్ పెయిన్ స్లెడ్జింగ్ టైమ్‌లో సైలెంట్‌గా ఉన్న రిషబ్ పంత్.. అతను బ్యాటింగ్‌కి వచ్చిన సమయంలో తన నోటికి పని చెప్పాడు. 'తాత్కాలిక కెప్టెన్ పదం విన్నావా..? మయాంక్ అగర్వాల్.. జడేజా.. ఇతడ్ని ఔట్ చేయాలంటే నువ్వు ఏం శ్రమించాల్సిన పనిలేదు. ఎందుకంటే అతను కేవలం మాట్లాడటం మాత్రమే చేయగలడు' అంటూ పంత్ వరుసగా కౌంటర్ల వర్షం కురిపించిన విషయం తెలిసిందే.

ఇక ఫించ్‌ను తప్పించండి

• ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్



మెల్‌బోర్న్: టీమిండియాతో జరుగనున్న నాల్గో టెస్టుకు అరోన్ ఫించ్‌ను పక్కన పెట్టాలని ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. ఇప్పటివరకూ టెస్టు ఫార్మాట్‌లో ఫించ్‌కు ఓపెనర్‌గా చాలా అవకాశాలు ఇచ్చినప్పటికీ వాటిని వినియోగించుకోవడంలో అతను విఫలమైన సంగతి తెలిసిందే. దాంతో చివరిదైన నాల్గో టెస్టుకు ఫించ్‌ను తుది జట్టు నుంచి తప్పించాలని పాంటింగ్ సూచించాడు. ఫించ్ స్థానంలో అన్‌క్యాప్‌డ్ ఆల్ రౌండర్ మార్నస్ లబూషేగ్నేని జట్టులోకి తీసుకోవాలన్నాడు. ఉస్మాన్ ఖ్వాజాతో కలిసి మార్నస్‌ను ఓపెనింగ్‌కు పంపి ప్రయోగం చేయాలన్నాడు. న్యూ ఇయర్ టెస్టును ఆసీస్ కొత్తగా ఆరంభిస్తే బాగుంటుదని పాంటింగ్ పేర్కొన్నాడు. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే టెస్టు మ్యాచ్‌కు కాస్త భిన్నంగా సన్నద్ధమవ్వాలన్నాడు. ఇప్పటివరకూ జరిగిన సిరీస్‌లో ఫించ్ 16 సగటుతో 97 పరుగులు మాత్రమే చేశాడు.

ఆసీస్ ప్రధానిని కలిసిన టీమిండియా ఆటగాళ్లు



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ప్రధానమంత్రిని భారత క్రికెటర్లు కలుసుకున్నారు. కొత్త సంవత్సరం-2019 సందర్భంగా సిడ్నీలోని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి స్కాట్ మోరిసన్ ఇంట్లో ఆయనను కలుసుకున్నారు. టీమిండియాతో పాటు ఆస్ట్రేలియా క్రికెటర్లు కూడా వెళ్లారు. టీమిండియా కోచ్ రవిశాస్త్రి కూడా జట్టుతోనే ఉన్నాడు. వీరందరూ కలిసి ప్రధానమంత్రి స్కాట్ మోరిసన్‌తో ఫొటోలు దిగారు. ఈ ఫొటోలను బీసీసీఐ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసింది.

మెల్‌బోర్న్ పిచ్‌కు యావరేజ్ రేటింగ్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాకు ఐసీసీ మళ్లీ షాకిచ్చింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు జరిగిన మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియం పిచ్‌కు యావరేజ్ రేటింగ్ ఇచ్చింది. రెండో టెస్టు నిర్వహించిన పెర్త్ పిచ్‌కు సైతం యావరేజ్ రేటింగే లభించింది. గతేడాది యాషెస్‌లో భాగంగా ఎంసీజీలో ఇంగ్లాండ్‌తో మ్యాచ్ జరిగింది. అప్పుడు పిచ్ పేలవంగా ఉండటంతో మూడు డీమెరిట్ పాయింట్లు విధించారు. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం కాస్త మెరుగైందని ఐసీసీ తెలిపింది. యావరేజ్ రేటింగ్‌కు ఐసీసీ డీమెరిట్ పాయింట్లేమీ విధించదు. పేలవంగా ఉంటే మూడు డీమెరిట్ పాయింట్లు విధిస్తుంది. ఐదేళ్ల కాలంలో ఒక మైదానానికి ఐదు డీమెరిట్ పాయింట్లు వస్తే నిబంధనల ప్రకారం దానికి టెస్టు హోదా రద్దు చేస్తారు. మెల్‌బోర్న్‌లో బ్యాటింగ్ చేయడం చాలా కష్టమైంది. పుజారా, కోహ్లీ, మయాంక్ కష్టపడటంతో రెండు రోజులకు భారత్ 443 పరుగులు చేసింది. చివరి రెండు రోజుల్లో పిచ్ కాస్త బాగున్నట్టు కనిపించినా టీమిండియా పేసర్లు 15-20 వికెట్లు తీశారు.



చివరి టెస్టు ఎంపికపై కసరత్తులు చేస్తున్న భారత్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలిచేందుకు అడుగు దూరంలో ఉన్న టీమిండియా.. చివరి టెస్టు కోసం జట్టు ఎంపికపై తీవ్రంగా కసరత్తులు చేస్తోంది. మెల్‌బోర్న్ వేదికగా గత ఆదివారం మూడో టెస్టులో.. సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న భారత్ జట్టు.. సీనియర్ ఓపెనర్లు మురళీ విజయ్, కేఎల్ రాహుల్‌పై వేటు వేసి వారి స్థానంలో కొత్త ఆటగాళ్లు మయాంక్ అగర్వాల్, హనుమ విహారీలను ఆడించింది. అయితే.. ఈ జోడీలో మయాంక్ హిట్ అవ్వగా.. హనుమ విహారి రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఒకే తరహాలో పేలవంగా వికెట్ చేజార్చుకున్నాడు. దీంతో.. అతడ్ని మళ్లీ మిడిలార్డర్‌లోనే ఆడిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం నుంచి సిడ్నీ వేదికగా ప్రారంభంకానున్న నాలుగో టెస్టులో తుది జట్టు ఎంపికపై భారత్ మల్లగుల్లాలు పడుతోంది. రోహిత్ శర్మ.. తన భార్య రితిక ఆదివారం ఓ పండంటి ఆడబిడ్డకి జన్మనివ్వడంతో భారత్‌కి వచ్చేశాడు. దీంతో.. అతను సిడ్నీ టెస్టుకి దూరంకానుండగా.. ఆ స్థానాన్ని ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తో భర్తీ చేయాలని టీమిండియా మేనేజ్‌మెంట్ యోచిస్తోంది. అయితే.. రోహిత్ శర్మ స్థానం(మిడిలార్డర్)లో మళ్లీ విహారికే అవకాశం ఇవ్వాలని కొందరు అభిప్రాయపడుతుండగా.. నాలుగో టెస్టులోనూ అతడ్నే ఓపెన ర్‌గా ఆడించాలని కూడా మరికొందరు చెప్పుకొస్తున్నారు. దీనికితోడు.. చీఫ్ సెలక్టర్ ప్రసాద్ సైతం చివరి రెండు టెస్టుల్లోనూ విహారి ఓపెనర్‌గా ఆడతాడని.. ఒకవేళ అతను విఫలమైనా తర్వాత సిరీస్‌లో అతనికి మిడి లార్డర్‌లో చాలినన్ని అవకాశాలు ఇస్తామని ఇప్పటికే ప్రకటించేశాడు. దీంతో.. టీమ్‌లో పాండ్యా రావడం మినహా మార్పులు ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఒకవేళ గాయం నుంచి కోలుకుని అశ్విన్ ఫిట్‌నెస్ నిరూపించుకుంటే.. అప్పుడు జడేజా స్థానంలో అతను జట్టులోకి వచ్చే అవకాశం ఉంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District. Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.